# పెన్ పవర్

PEN POWER 12 YEARS JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక :255 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : తిరుపతి | మంగళవారం 22 సెప్టెంబర్ 2026 | వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :255 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : TIRUPATI | TUE 22 SEPTEMBER 2026 | PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur




## 2028 నాటికి కార్బన్ న్యూట్రల్‌గా కుప్పం

- కుప్పంలో వివిధ పథకాల లబ్ధిదారులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి
- సూపర్ సిక్స్, సంజీవని పథకాల అమలు తీరుపై ఆరా
- త్వరలో రాష్ట్రవ్యాప్తంగా సంజీవని కార్యక్రమం విస్తరణకు ప్రణాళిక
- వ్యవసాయం, పర్యాటకం, మౌలిక వసతులపై అధికారులకు కీలక ఆదేశాలు

పెన్ పవర్ డెస్క్:ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పంలో విస్తృతంగా పర్యటించి, పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, క్షేత్రస్థాయిలో వాటి అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలు

- మిగతా 2లో



## టీచర్లపై దాడి నిందితులను వదిలిపెట్టం..


### మంత్రి లోకేశ్ మాస్ వార్నింగ్

- స్పోర్ట్స్ కోటా టీచర్లపై దాడికి దిగారంటూ లోకేశ్ ఆగ్రహం
- దైవం వంటి గురువులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరిక
- దేశానికి వన్నె తెచ్చిన క్రీడాకారులను జగన్ అవమానిస్తున్నారని ఆరోపణ
- రౌడీ షీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను టీచర్లపైకి ఉసిగొల్పారని విమర్శ
- ప్రభుత్వ పాఠశాలలు, టీచర్ల జోలికి రావొద్దని హితవు

- మిగతా 2లో

## శబరిమలలో ప్రసాదం కొరత..

### హైకోర్టుకు వెళ్తానన్న మంత్రి




పెన్ పవర్ డెస్క్: సుప్రసిద్ధ శబరిమల అయ్యప్ప ఆలయంలో ప్రసాదం కొరతపై కేరళం ప్రభుత్వం, ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు మధ్య వివాదం ముదిరింది. భక్తులకు సరిపడా

- మిగతా 2లో



## విజయవాడలో 'శాప్' వద్ద ఉద్రిక్తత..

# టీచర్లు వర్సెస్ వైసీపీ..

### తోకలు కత్తిరిస్తానంటూ చంద్రబాబు ఫైర్

- విజయవాడ శాప్ కార్యాలయం వద్ద స్పోర్ట్స్ కోటా టీచర్లపై వైసీపీ నేతల దాడి యత్నం
- తమ నియామకాలు పారదర్శకమని చెప్పేందుకు వచ్చిన టీచర్లు.. అక్రమాలంటూ వైసీపీ నిరసన
- ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం, రౌడీయిజం చేస్తే తోకలు కత్తిరిస్తామని హెచ్చరిక
- గురువులపై దాడులను సహించబోమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టీకరణ
- ప్రతిపక్షానికి దమ్ముంటే ఆధారాలతో అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరిన ముఖ్యమంత్రి

పెన్ పవర్ డెస్క్:విజయవాడలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) కార్యాలయం వద్ద మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన ఉపాధ్యాయులపై వైసీపీ నేతలు దాడికి యత్నించారన్న ఆరోపణలపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కుప్పం పర్యటనలో ఉన్న ఆయన ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో రౌడీయిజం, అరాచకాలను ఏమాత్రం ఉపేక్షించేది లేదని, అలాంటి చర్యలకు పాల్పడేవారి తోకలు కత్తిరిస్తామని హెచ్చరించారు. గురువులపై దాడులకు దిగడాన్ని ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని తీరుతామని స్పష్టం చేశారు.

**శాప్ కార్యాలయం వద్ద ఏం జరిగింది?**

మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ వైసీపీ నేతలు కొద్ది రోజులుగా విమర్శలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, తమ నియామకాలు అత్యంత పారదర్శకంగా జరిగాయని, తమ సర్టిఫికెట్లు, సాధించిన పతకాలు అన్నీ నిజమైనవని స్పష్టం చేసేందుకు స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన ఉపాధ్యాయులు సోమవారం విజయవాడలోని శాప్ కార్యాలయానికి చేరుకున్నారు. క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, శాప్ ఛైర్మన్, ఎండీలను కలిసి తమ

- మిగతా 2లో



## స్టాలిన్ ఓటమి నన్ను షాక్‌కు గురిచేసింది

- విజయ్ పాలనపై అప్పుడే మాట్లాడటం సరికాదన్న ప్రకాశ్ రాజ్
- బీజేపీ పతనానికి సమయం ఆసన్నమయిందని వ్యాఖ్య
- తనకు కూడా మోదీనే ప్రధానమంత్రి అన్న ప్రకాశ్ రాజ్


- మిగతా 2లో

## ఏపీలో జూడాలకు గుడ్ న్యూస్ చెప్పిన కూటమి ప్రభుత్వం

- ఏపీలో జూనియర్ డాక్టర్లు, హౌస్ సర్జన్ల స్టైఫండ్ పెంపు
- ఎంబీబీఎస్, బీడీఎస్ ఇంటర్న్‌లకు 10 శాతం పెరుగుదల
- పీజీ విద్యార్థులకు 5%, సూపర్ స్పెషాలిటీ వారికి 3.5% పెంపు
- ప్రభుత్వంపై ఏటా రూ.34.08 కోట్ల అదనపు ఆర్థిక భారం
- 2026 జనవరి 1 నుంచే పెంపు వర్తిస్తుందని ఉత్తర్వుల్లో వెల్లడి

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పనిచేస్తున్న జూనియర్ డాక్టర్లు, హౌస్ సర్జన్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారి స్టైఫండ్‌ను పెంచుతూ సోమవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది.

- మిగతా 2లో




## బంగాళాఖాతంలో వాయుగుండం..


# ఏపీలో 4 రోజులు భారీ వర్షాలు

- బంగాళాఖాతంలో అల్పపీడనం, వాయుగుండంగా బలపడే అవకాశం
- రాబోయే నాలుగు రోజులు రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు
- పలు కోస్తాంధ్ర జిల్లాలకు విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిక
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని సూచన
- లోతట్టు ప్రాంత ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశం

పెన్ పవర్ డెస్క్:బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే నాలుగు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. ప్రస్తుతం కేంద్రీకృతమై ఉన్న

- మిగతా 2లో



## చైనాకు భారత ఎగుమతులు జోరు..

### 40 శాతం వృద్ధి!

- చైనాకు భారీగా పెరిగిన భారత ఎగుమతులు
- గత ఐదు నెలల్లో దాదాపు 40 శాతం వృద్ధి నమోదు
- ఎలక్ట్రానిక్స్ వస్తువుల ఎగుమతుల్లో గణనీయమైన పెరుగుదల
- ఏఐ, డేటా సెంటర్ల వల్లే డిమాండ్ పెరిగిందంటున్న నిపుణులు
- అయినప్పటికీ వాణిజ్య లోటులో పెద్దగా మార్పు లేని వైనం

పెన్ పవర్ డెస్క్:భారత్ నుంచి చైనాకు ఎగుమతులు అనూహ్యంగా వృద్ధి చెందుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఐదు నెలల్లో (ఏప్రిల్-ఆగస్టు) చైనాకు భారత ఎగుమ తులు సుమారు

- మిగతా 2లో

## కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ కొనసాగుతున్న భూసర్వే..

# రంగంలోకి రెవెన్యూ అధికారులు

- ఎర్రవల్లిలో భూములపై కొనసాగుతున్న రెవెన్యూ సర్వే
- సర్వే నంబర్ 325పై అధికారుల ప్రత్యేక దృష్టి
- మొత్తం 388 ఎకరాల భూముల పరిశీలన
- శాటిలైట్ మ్యాపింగ్‌తో భూముల హద్దుల పరిశీలన
- ఆక్రమణలని తేలితే భూముల స్వాధీనానికి చర్యలు

- మిగతా 2లో



## మైసమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన పవన్ కల్యాణ్



- పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ పర్యటన
- ఫక్రుద్దీన్ పాలెంలో సుందరీకరించిన చెరువు ప్రారంభం
- పిఠాపురంలో రూ. 6 కోట్లతో 11 చెరువుల ఆధునీకరణ
- గ్రామాల్లో చెరువులను ఆహ్లాద, ఆరోగ్య కేంద్రాలుగా మార్చే ప్రణాళిక
- రాష్ట్రవ్యాప్తంగా రూ. 50 కోట్లతో 105 చెరువుల అభివృద్ధి

- మిగతా 2లో

## అఫ్గానిస్థాన్‌పై పాక్ వైమానిక దాడులు..

# 28 మంది మృతి..!



పెన్ పవర్ డెస్క్:అఫ్గానిస్థాన్‌పై సోమవారం పాకిస్థాన్ వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో 28 మంది ఉగ్రవాదులు మరణించినట్లు పాక్ ప్రకటించగా.. ముగ్గురు పౌరులు ప్రాణాలు కోల్పోయారని అఫ్గాన్ వెల్లడించింది. గత కొన్ని నెలలుగా

- మిగతా 2లో

# 2028 నాటికి కార్బన్ న్యూట్రల్‌గా కుప్పం

- మొదటి పేజి తరువాయి

అందుకుంటున్న లబ్ధిదారులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా వంటి పథకాల ద్వారా అందుతున్న ప్రయోజనాలు, వాటితో కుటుంబంలో వచ్చిన ఆర్థిక మార్పుల గురించి లబ్ధిదారులను సీఎం అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా, కుప్పంలోని యువ పారిశ్రామికవేత్తలతో సమావేశమై వారికి ప్రభుత్వ ప్రోత్సాహంపై భరోసా ఇచ్చారు. పైలట్ ప్రాజెక్టుగా అమలవుతున్న సంజీవని సేవల లబ్ధిదారులతో మాట్లాడి, పథకం పనితీరుపై ఆరా తీశారు. త్వరలోనే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "ప్రతి పేద కుటుంబానికి అండగా నిలవాలనే లక్ష్యంతో, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే మా ప్రభుత్వ ధ్యేయం" అని స్పష్టం చేశారు.

**అభివృద్ధి పనులపై సమీక్ష, అధికారులకు ఆదేశాలు**

కుప్పంలో జరుగుతున్న మౌలిక వసతుల కల్పనపై స్థానికులతో సీఎం చర్చించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, సీసీ రోడ్లు, తాగునీటి సరఫరా వంటి అంశాలపై ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. జల్ జీవన్ మిషన్ పనుల కోసం కొత్త రోడ్లు వేయడానికి ముందే పైప్‌లైన్లు వేయాలని, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి స్ట్రీట్ లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

**కుప్పం దేశానికే ఆదర్శం**

"2028 నాటికి కుప్పం నియోజకవర్గాన్ని కార్బన్ న్యూట్రల్‌గా మార్చడమే లక్ష్యం. ఈ ఏడాది డిసెంబరు నాటికి ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయాలి. వ్యర్థాలను సంపదగా మార్చి, పచ్చదనాన్ని 80 శాతానికి పెంచి కుప్పాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు. వ్యవసాయ వ్యయం తగ్గించి, రైతుల ఆదాయం పెంచేందుకు ప్రణాళికలు రచిస్తామని, పర్యాటకంగాను కుప్పాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. జీరో పావర్టీ కార్యక్రమంలో భాగంగా 2026 డిసెంబరు నాటికి నియోజకవర్గంలోని 8,904 'బంగారు కుటుంబాలను' ఆర్థికంగా ఆదుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు.

## ఎడిటర్ వ్యూ

## డాక్టరమ్మ ఆపరేషన్ సక్సెస్ చేస్తుందా? భీమిలీ నుంచి గట్టెక్కుతారా?

భీమిలి నియోజకవర్గ సమన్వయకర్తగా బొత్స అనూష ను నియమిస్తూ జగన్ నిర్ణయం తీసుకున్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు నియామకంజరిగినట్లు వైసీపీ నుంచి అధికారిక ప్రకటన తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం విడుదల చేసింది. భీమిలీ నియోజకవర్గ ఇన్ ఛార్జిగా... చిన్న శ్రీను పార్టీని వీడటంతో ఆయన స్థానంలో బొత్స అనూషను నియమించాలని జగన్ నిర్ణయించారు. మొన్న బొత్సతో సమావేశమై వన్ టూ వన్ చర్చించిన తర్వాత జగన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. భీమిలీ నియోజకవర్గం వైసీపీ ఇన్ ఛార్జిగా బొత్స అనూష వ్యవహరించనున్నారు. అయితే బొత్స అనూష ఎంపిక భీమిలి నియోజకవర్గంలో సరైన ఎంపికేనా? అన్న చర్చ జరుగుతుంది. అక్కడ బలమైన టీడీపీ నేత గంటా శ్రీనివాసరావు ఉన్నారు. అలాంటి చోట రాజకీయ అరంగ్రేట్రం చేస్తున్న బొత్స అనూష ఏ మేరకు విజయం సాధిస్తారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సొంత పార్టీలోనే ఈ రకమైన అభిప్రాయం వ్యక్తమవుతుంది.

**బొత్స వారసురాలిగా...**

బొత్స అనూష కాపు సామాజికవర్గం నేత కావచ్చు. బొత్స రాజకీయ వారసురాలిగా ఆమె రాజకీయ ఓనమాలు భీమిలి నుంచి నేర్చుకోవాల్సి ఉంది. తొలుత విజయనగరం జడ్పీ ఛైర్మన్ గా బొత్స అనూషను ఎంపిక చేయాలని నిర్ణయించారు. అయితే చిన్న శ్రీను పార్టీ మారిన తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో బొత్స అనూషకు భీమిలీ బాధ్యతలను అప్పగించడం సబబేనా? అన్న ప్రశ్న అందరిలోనూ కలుగుతుంది. తొలుత గుడివాడ అమర్నాథ్, మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు వంటి పేర్లను పరిశీలించినప్పటికీ వారికంటే కొత్త వారినే ఎంపిక చేయడం మంచిదని జగన్ భావించారు. అయితే భీమిలీలో కాపు సామాజికవర్గం ఓటర్లు ఎక్కువ. జనసేన, టీడీపీ కలసి ఉంటే అక్కడ నెగ్గుకు రావడం కష్టమే. ఈ పెను సవాల్ నుంచి ఈ డాక్టర్ బొత్స అనూష ఎలా బయటపడతారన్నది సందేహంగా మారింది.

**మజ్జి శ్రీనివాసరావు నిష్క్రమణతో ...**

ఇప్పటివరకు భీమిలి ఇన్ ఛార్జ్ గా ఉన్న మజ్జి శ్రీనివాసరావు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఆ స్థానాన్ని భర్తీ చేస్తూ పార్టీ శ్రేణులు చెల్లాచెదురు కాకుండా చూడటానికి జగన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉత్తరాంధ్రలో బొత్స కుటుంబానికి పట్టుంది. ఆయనకు వ్యక్తిగతంగా బలముంది. మరొకవైపు సీనియర్ నేత కావడం, కాపు సామాజికవర్గం కావడంతో ఆర్థికంగా, సామాజికవర్గం పరంగా బలంగా కనిపిస్తుంది. విజయనగరం, విశాఖపట్నం జిల్లాల రాజకీయాల్లో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కుటుంబానికి గట్టి పట్టుంది. బొత్స కుటుంబానికి చెందిన వ్యక్తిని ఇక్కడ పెట్టడం వల్ల స్థానిక క్యాడర్ కూడా కదలకుండా పార్టీ వైపే ఉంటుందని అధిష్టానం భావించింది. డాక్టర్ బొత్స అనూష వైద్య విద్యను అభ్యసించి, ఇటీవలే రాజకీయాల్లో యాక్టివ్ అవుతున్నారు. మహిళా, యువ కోటాలో ఆమెను రంగంలోకి దించడం ద్వారా ప్రతిపక్ష నేత గంటా శ్రీనివాసరావును ఢీకొట్టేందుకు వైసీపీ ఒక కొత్త అస్త్రాన్ని ప్రయోగించినట్లయింది. వాస్తవానికి బొత్స అనూష విజయనగరం జిల్లా పరిషత్ పీఠంపై ఆసక్తి చూపించగా, ఆమెను భీమిలికి పంపడంపై భిన్నమైన విశ్లేషణలు వస్తున్నాయి. అయినప్పటికీ, నియామకం జరిగిన వెంటనే బొత్స అనూష తన తండ్రి బొత్స సత్యనారాయణతో కలిసి స్థానిక క్యాడర్ ను కలుపుకుంటూ భీమిలిలో పార్టీ బలోపేతానికి పూర్తి స్థాయిలో రంగంలోకి దిగారు. మరి ఈ డాక్టర్ భీమిలిలో వైసీపీని ఎలా ఆపరేషన్ చేస్తారన్నది చూడాలి.

## శబరిమలలో ప్రసాదం కొరత..

- మొదటి పేజి తరువాయి

ప్రసాదం లేకపోవడంపై కేరళం మంత్రి మురళీధరన్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నిర్వహణ లోపం వల్లే ఇలాంటి పరిస్థితి తలెత్తిందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అవసరమైతే హైకోర్టుకు వెళ్తానని అన్నారు. ప్రసాదం కొరత ఏర్పడటంతో ఆదివారం పంపిణీని పరిమితం చేసిన సంగతి తెలిసిందే. ప్రతి యాత్రికుడు ఒక అరవణ పాయసం, మూడు అప్పం ప్యాకెట్లను మాత్రమే కొనుగోలు చేసేందుకు అనుమతిచ్చారు. ప్రసాదం కౌంటర్లను మధ్యాహ్నం 1.30కే మూసేశారు. తిరిగి 5 గంటలకు మళ్లీ తెరిచారు. దీంతో భక్తుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ తరహా పరిస్థితులు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా ఉండాలంటే.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని మంత్రి మురళీధరన్ అన్నారు. ముఖ్యమంత్రి వి.డి. సతీశన్‌తోనూ మాట్లాడి.. విచారణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని కోరనున్నట్లు చెప్పారు. అయితే, కన్ని నెలలో స్వామిని దర్శించుకునే భక్తుల కోసం దాదాపు 2.6 లక్షల డబ్బాల ప్రసాదాన్ని ముందే సిద్ధం చేసినట్లు దేవస్థానం అధికారులు చెబుతున్నారు. గతేడాది కంటే 50 వేల డబ్బాలు అధికంగానే తయారు చేశామని, సీజను ప్రారంభం కాకముందే భక్తుల సంఖ్య పెరిగిపోవడంతోనే ఈ సమస్య తలెత్తిందని తెలిపారు. సోమవారం నాటికి కేవలం 14 వేల డబ్బాలు మాత్రమే మిగిలి ఉన్నట్లు చెప్పారు. ప్రసాదం తయారీ కేంద్రాన్ని ఆధునీకరిస్తున్నందువల్లే కొరత ఏర్పడిందని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు చెబుతుండటంపై మంత్రి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా పనులు ఎలా చేపడతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శబరిమల యాత్ర నేపథ్యంలో.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదన్న ఉద్దేశంతో ముందస్తుగా ప్రసాదం తయారీ కేంద్రాన్ని ఆధునీకరిస్తున్నట్లు దేవస్థానం బోర్డు తెలిపింది.

## కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ కొనసాగుతున్న భూసర్వే.. రంగంలోకి రెవెన్యూ అధికారులు

సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసర భూములపై రెవెన్యూ అధికారులు సర్వే కొనసాగిస్తున్నారు. ఎర్రవల్లితో పాటు వెంకటాపూర్, వరదరాజుపూర్ సరిహద్దుల్లో ఉన్న భూములను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో నిలిచిన సర్వే.. సోమవారం ఉదయం తిరిగి ప్రారంభమైంది. సర్వే నంబర్ 325 పరిధిలో ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూములపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. మొత్తం 388 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూముల్లో ప్రభుత్వ భూమి ఎంత? అసైన్డ్ భూమి ఎంత? ప్రస్తుతం ఎవరి అధీనంలో ఉంది? ప్రైవేటు పట్టా భూములు ఎంతమేర ఉన్నాయి? అనే వివరాలను సేకరిస్తున్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ సుదర్శన్ రాథోడ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సేవ్యానాయక్, గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, స్థానిక తహసీల్దార్లతో కూడిన ప్రత్యేక బృందాలు సర్వేలో పాల్గొంటున్నాయి. శాటిలైట్ మ్యాపింగ్, ఆధునిక సాంకేతికతతో పాటు పాత రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తూ భూముల హద్దులను నిర్ధారిస్తున్నారు. సర్వే నంబర్ 325 పరిధిలో భూములు ఉన్న 100 మందికి పైగా రైతులకు ఇప్పటికే అధికారులు నోటీసులు ఇచ్చారు. పట్టాదార్ పాస్‌పుస్తకాలు, ఇతర యాజమాన్య పత్రాలతో సర్వే ప్రాంతానికి రావాలని సూచించారు. ఫామ్‌హౌస్ పరిసర భూముల కేటాయింపులు, ధరణి రికార్డుల్లో అక్రమాలపై ఇటీవల అసెంబ్లీలో చర్చ జరిగిన నేపథ్యంలో ఈ విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. సర్వే పూర్తయ్యాక సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి అందజేయనున్నారు. ప్రభుత్వ లేదా అసైన్డ్ భూములు ఆక్రమణకు గురైనట్లు తేలితే.. నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

## విజయవాడలో 'శాప్' వద్ద ఉద్రిక్తత..

# టీచర్లు వర్సెస్ వైసీపీ..

- మొదటి పేజి తరువాయి

గోడు వెళ్లబుచ్చుకోవాలని, వినతిపత్రం సమర్పించాలని వారు భావించారు. అయితే, అదే సమయంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో శాప్ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసనకు దిగారు. డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో అక్కడే ఉన్న ఉపాధ్యాయులు కూడా తమకు న్యాయం చేయాలని, తమపై నిరాధార ఆరోపణలు మానుకోవాలని ప్రతి నినాదాలు ప్రారంభించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పోటాపోటీ నినాదాలతో ఆ ప్రాంతంలో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది.

**వైసీపీపై నిప్పులు చెరిగిన సీఎం చంద్రబాబు**

వైసీపీ రోజురోజుకూ మరింత దూకుడుగా, అరాచకంగా వ్యవహరిస్తోందని చంద్రబాబు మండిపడ్డారు. "విజయవాడలో గురువుల మీద రౌడీలు దాడులు చేస్తున్నారు. దీన్ని చూస్తూ ప్రభుత్వం నిశ్శబ్దంగా ఉండదు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని ఆయన అన్నారు. విజయవాడలో సాక్షి రిపోర్టర్ ప్రమేయంతో ఒక ఉపాధ్యాయుడిపై జరిగిందని, వైసీపీ తీరు అత్యంత దారుణంగా ఉందని విమర్శించారు. సమస్యలుంటే చట్టపరంగా న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చని, అంతేకానీ భౌతిక దాడులకు పాల్పడటం, ఉపాధ్యాయులపై రౌడీలను ఉసిగొల్పడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని హితవు పలికారు. గత ప్రభుత్వంలోనూ ఇదే విధంగా రౌడీయిజం, అరాచకాలతో పాలన సాగిందని, కుప్పంలో తనను సైతం అడ్డుకునే ప్రయత్నం చేశారని గుర్తుచేశారు. స్పోర్ట్స్ కోటా నియామకాలపై ప్రతిపక్షానికి దమ్ముంటే ఆధారాలతో అసెంబ్లీకి రావాలని, అక్కడ తమ వద్ద ఉన్న ఆధారాలతో వారి నోరు మూయిస్తామని సవాల్ విసిరారు. క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సైతం ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ పరిణామాలతో రాష్ట్ర రాజకీయాలు మరింత వేడెక్కాయి.

# టీచర్లపై దాడి నిందితులను వదిలిపెట్టం..

విజయవాడలో స్పోర్ట్స్ కోటా డీఎస్సీ-2025 టీచర్లపై దాడికి వైసీపీ ముఠాలు దాడికి దిగాయంటూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీపై తీవ్ర ఆరోపణలు చేస్తూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. క్రీడాకారులుగా దేశానికి పేరు తీసుకొచ్చిన వారికి అన్యాయం చేయడం సరికాదని అన్నారు. దైవంలా భావించే టీచర్లపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

స్పోర్ట్స్ కోటాలో అవకతవకలు జరిగాయంటూ ఫేక్ ఆరోపణలు చేసినప్పుడే జగన్ దుర్బుద్ధి బయటపడిందని లోకేశ్ విమర్శించారు. క్రీడల్లో ప్రతిభ చూపించి టీచర్ ఉద్యోగాలు సాధించిన వారిని వైసీపీ అవమానిస్తోందని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలంటూ స్పోర్ట్స్ కోటా డీఎస్సీ-2025 టీచర్లు విజయవాడ శాప్ కార్యాలయం వద్ద అధికారులను కలిశారని లోకేశ్ తెలిపారు. ఈ సమయంలో వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు టీచర్లపై దాడికి దిగారని ఆరోపించారు. రౌడీ షీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను టీచర్లపైకి ఉసిగొల్పారని లోకేశ్ ఆరోపించారు. గురువులపై రాడ్లు, కర్రలతో దాడి చేయడం దారుణమని అన్నారు.

టీచర్లపై దాడి చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని లోకేశ్ స్పష్టం చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, టీచర్ల జోలికి వైసీపీ రావడం మానుకోవాలని సూచించారు.

## మైసమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన పవన్ కల్యాణ్

ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ సోమవారం సొంత నియోజకవర్గంలో పర్యటించారు. ఫకృద్దీన్ పాలెం గ్రామంలోని మైసమ్మ చెరువు గట్టుపై వెలసిన మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని, పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, గ్రామీణ చెరువులకు సరికొత్త రూపునిచ్చే బృహత్తర కార్యక్రమంలో భాగంగా రూ. 73 లక్షల వ్యయంతో సుందరీకరించిన మైసమ్మ చెరువును ప్రజలకు అంకితం చేశారు. గ్రామాల్లోని చెరువులను కేవలం నీటి వనరులుగా కాకుండా, ప్రజలందరికీ ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని పంచే సామాజిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ తెలిపారు. ఫకృద్దీన్ పాలెంలోని మైసమ్మ చెరువును రాష్ట్రానికే ఒక మోడల్‌గా అభివృద్ధి చేసినట్లు వివరించారు. చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్, ఓపెన్ ఎయిర్ జిమ్, పిల్లల పార్కును ఆయన ప్రారంభించారు. చెరువు గట్టుపై కలియదిరుగుతూ, అక్కడి వృక్షాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువు మధ్యలో నూతనంగా నిర్మిస్తున్న నందీశ్వరుడి సహిత శివుని విగ్రహాన్ని పరిశీలించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా చెరువు గట్టును బలోపేతం చేసి, పచ్చదనంతో నింపారు. ప్రజలు వ్యాయామం చేసుకునేలా ఓపెన్ జిమ్‌తో పాటు, జాతీయ భావాన్ని పెంపొందించేలా జెండా స్థూపాన్ని కూడా ఏర్పాటు చేశారు. చెరువు పక్కనే చిన్నారుల కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన పార్కును పిల్లలతో కలిసి ప్రారంభించిన పవన్ కల్యాణ్, వారితో సరదాగా గడిపి చాక్లెట్లు పంచారు.

**రాష్ట్రవ్యాప్తంగా చెరువుల ఆధునీకరణ**

ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన (గ్రావీఖ్) నిధులతో రాష్ట్రవ్యాప్తంగా రూ. 50 కోట్లతో 105 చెరువుల సుందరీకరణ పనులు

చేపట్టినట్లు పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఒక్క పిఠాపురం నియోజకవర్గంలోనే రూ. 6 కోట్లతో 11 చెరువులను అభివృద్ధి చేస్తున్నామని, వీటికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కాకినాడ జిల్లా పరిధిలో అభివృద్ధి చేసిన 14 చెరువుల ఫొటో గ్యాలరీని తిలకించారు. ఈ నెలాఖరు నాటికి రాష్ట్రంలోని అన్ని చెరువుల పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

పర్యటనలో భాగంగా ఆయన గ్రామ సచివాలయాన్ని, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామస్తుల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యలను ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## బంగాళాఖాతంలో వాయుగుండం..

# ఏపీలో 4 రోజులు భారీ వర్షాలు

- మొదటి పేజి తరువాయి

అల్పపీడనం మంగళవారానికి వాయుగుండంగా బలపడనుందని, దీని ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు దంచికొడతాయని స్పష్టం చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. విపత్తుల నిర్వహణ సంస్థ అంచనాల ప్రకారం, మంగళవారం (సెప్టెంబర్ 22) నుంచి రాష్ట్రంలో వర్షాల తీవ్రత పెరగనుంది. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖపట్నం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని, మిగిలిన కోస్తాంధ్ర జిల్లాల్లో మోస్తరు వర్షాలు, రాయలసీమ ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడతాయని తెలిపింది. బుధవారం (సెప్టెంబర్ 23) నాటికి వర్షాల ప్రభావం మరింత పెరగనుంది. అల్లూరి, పోలవరం, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో భారీ వర్షాలు, ఉత్తరాంధ్ర జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. గురు, శుక్రవారాల్లో సైతం కోస్తా జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు.. ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడతాయని వివరించింది. ఈ నేపథ్యంలో విపత్తుల నిర్వహణ సంస్థ కీలక హెచ్చరికలు జారీ చేసింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, అలల తీవ్రత ఎక్కువగా ఉంటుందని అంచనా వేసింది. అందువల్ల మత్స్యకారులు తదుపరి ఆదేశాలు వచ్చేవరకు వేటకు వెళ్లరాదని స్పష్టంగా సూచించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు, నదీ పరివాహక ప్రాంతాల వారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది. ప్రజలు ఎప్పటికప్పుడు అధికారిక ప్రకటనలను గమనిస్తూ, అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## అఫ్గానిస్థాన్‌పై పాక్ వైమానిక దాడులు.. 28 మంది మృతి..!

- మొదటి పేజి తరువాయి

ఈ రెండు దేశాల మధ్య జరుగుతోన్న ఘర్షణల్లో ఇప్పటికే వందల సంఖ్యలో మరణాలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. తాజా వైమానిక దాడులు అఫ్గానిస్థాన్‌లోని కునార్, పక్తికా, ఖోస్త్ ప్రావిన్సులను లక్ష్యంగా చేసుకున్నాయని కాబూల్ అధికారులు వెల్లడించారు. దాడుల్లో పలు నివాసాలు ధ్వంసమయ్యాయన్నారు. పాక్ వైమానిక దాడులను తాలిబన్ ప్రధాన ప్రతినిధి జబీవుల్లా ముజాహిద్ తీవ్రంగా ఖండించారు. రోజురోజుకూ ఇస్లామాబాద్ దురాక్రమణలు పెరిగిపోతున్నాయని దుయ్యబట్టారు. దీనికి ప్రతీకారం తీర్చుకుంటామన్నారు. ఇటీవల పాక్‌లో జరిగిన పలు ఉగ్రదాడులకు ప్రతిస్పందనగా.. అఫ్గాన్‌పై దాడులు చేపడతామని ఆ దేశ సమాచార మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలోనే దాడులు చోటుచేసుకున్నాయి.

## స్టాలిన్ ఓటమి నన్ను షాక్‌కు గురిచేసింది

కొళత్తూరు నియోజకవర్గంలో డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ ఊహించని రీతిలో పరాజయం పాలవడం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ప్రముఖ సినీ నటుడు ప్రకాశ్ రాజ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో మార్పును ఆకాంక్షించే ప్రస్తుత ముఖ్యమంత్రి విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నుకున్నారని చెప్పారు. విజయ్ ప్రభుత్వ పాలనను అప్పుడే విమర్శించడం సరికాదని... కొత్త ప్రభుత్వానికి కనీసం ఏడాది సమయాన్నయినా ఇవ్వాలని అన్నారు. ఏడాది పాలన పూర్తయిన తాను స్పందిస్తానని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇప్పటికే సైలెంట్ మోడ్ లోకి వెళ్లిపోయిందని... వారి పతన సమయం ఆసన్నమైందని ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యానించారు. త్వరలోనే వారి విధానాల తప్పులకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. భవిష్యత్తులో రానున్న నియోజకవర్గాల పునర్విభజన బిల్లు దక్షిణాది రాష్ట్రాల పార్లమెంటరీ ప్రాతినిధ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని, దీనికి ఏ పార్టీ మద్దతు ఇచ్చినా తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. నరేంద్ర మోదీ తనకు వ్యక్తిగతంగా ఇష్టం లేదని, ఆయనకు తాను ఓటు వేయకపోయినా... తనకు కూడా ఆయనే ప్రధానమంత్రి అని చెప్పారు. అందుకే ప్రజా సమస్యలపై ఆయనను నిలదీసే హక్కు తనకు ఉందని స్పష్టం చేశారు.

## ఏపీలో జూడాలకు గుడ్ న్యూస్ చెప్పిన కూటమి ప్రభుత్వం

- మొదటి పేజి తరువాయి

పెంచిన స్టైఫండ్ 2026 జనవరి 1వ తేదీ నుంచి వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ.34.08 కోట్ల అదనపు భారం పడనుంది. వివరాల్లోకి వెళితే, తమ పనిభారానికి తగినట్లుగా స్టైఫండ్ పెంచాలని జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ (జూడా) కొంతకాలంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వారి డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని స్టైఫండ్ పెంపునకు ఆమోదం తెలిపింది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ఎంబీబీఎస్, బీడీఎస్ హౌస్ సర్జన్లకు 10 శాతం స్టైఫండ్ పెంచారు. దీంతో వారి నెలవారీ స్టైఫండ్ రూ.28,497కి చేరింది. అదేవిధంగా, పీజీ డిగ్రీ, డిప్లొమా కోర్సులు చేస్తున్న వైద్య విద్యార్థులకు 5 శాతం, సూపర్ స్పెషాలిటీ కోర్సులు అభ్యసిస్తున్న వారికి 3.5 శాతం చొప్పున స్టైఫండ్‌ను పెంచారు. ఈ పెంపు నిర్ణయం ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ మెడిసిన్, సూపర్ స్పెషాలిటీ, ఎండీఎస్, డీఎన్‌బీ విద్యార్థులందరికీ వర్తిస్తుంది. జూనియర్ డాక్టర్ల ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల వైద్య విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## చైనాకు భారత ఎగుమతులు జోరు.. 40 శాతం వృద్ధి!

- మొదటి పేజి తరువాయి

40 శాతం మేర పెరిగాయి. ముఖ్యంగా 'మేడ్ ఇన్ ఇండియా' ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులు ఈ వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయినప్పటికీ, ఇరు దేశాల మధ్య వాణిజ్య లోటు ఇప్పటికీ చైనాకు అనుకూలంగా కొనసాగుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో చైనాకు భారత ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు మూడు రెట్లు పెరిగి 3.18 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. స్మార్ట్‌ఫోన్లు, ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులు, డిస్‌ప్లే మాడ్యూల్స్ వంటివి వీటిలో ప్రధానమైనవి. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-ఆగస్టు మధ్య కాలంలోనూ ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 15 శాతానికి పైగా పెరిగాయి. ఇదే సమయంలో ఇంజినీరింగ్ వస్తువుల ఎగుమతులు సైతం 21 శాతం మేర వృద్ధిని నమోదు చేశాయి. అంతర్జాతీయంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా సెంటర్ల కోసం అత్యాధునిక పరికరాలకు డిమాండ్ పెరగడమే ఈ వృద్ధికి ప్రధాన కారణమని పరిశ్రమ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. "ప్రపంచంలోనే అత్యంత పోటీతత్వంతో కూడిన సరఫరా వ్యవస్థలో భారత తయారీ రంగం తన విశ్వసనీయతను చాటుకుంటోంది" అని ఇండియన్ సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ ఛైర్మన్ పంకజ్ మోహింద్రూ పేర్కొన్నారు.

అయితే, ఈ వృద్ధి స్వల్ప స్థాయి నుంచి ప్రారంభమవడంతో చైనాతో నెలకొన్న భారీ వాణిజ్య లోటుపై చెప్పుకోదగ్గ ప్రభావం చూపలేదు. గత ఆర్థిక సంవత్సరంలో చైనా నుంచి భారత్ దిగుమతులు 131.6 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ప్రస్తుతం భారత ఎగుమతులకు అమెరికానే అతిపెద్ద మార్కెట్‌గా కొనసాగుతోంది.

# పేట సామాజిక వైద్యశాలలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయండి

## " మంత్రికి వినతి పత్రం అందించిన రాష్ట్ర బిజెపి ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు"



**నాయుడుపేట: పెన్ పవర్, సెప్టెంబర్ 21**

నాయుడుపేట పట్టణ, మండల పరిసరాల గ్రామాల్లోని డయాలసిస్ రోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నాయుడుపేట సామాజిక వైద్యశాలలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కు రాష్ట్ర బిజెపి ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు బొల్లకాయల విజయ్ కుమార్, పార్టీ నాయకులతో కలిసి పూల బొకేతో స్వాగతం పలికి వినతి పత్రం అందజేశారు. సోమవారం మంత్రి సత్య కుమార్ యాదవ్ పుత్తూరులోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే కార్యక్రమానికి విచ్చేసిన ఆయనకు తిరుపతి ఎయిర్ పోర్టులో మర్యాదపూర్వకంగా కలసి వినతి పత్రాన్ని అందజేశారు. నాయుడుపేట మండల పరిసరాల డయాలసిస్ రోగులు అటు తిరుపతి, ఇటు నెల్లూరు నగరాలకు వెళ్లడానికి అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారి సౌకర్యార్థం సి హెచ్ సి లో డయాలసిస్ చికిత్స కేంద్రం ఏర్పాటుచేసి రోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అంతేకాకుండా ప్రాంగణ ఆవరణంలోనే గతంలో నేర్పించి, నిరుపయోగంగా ఉన్న ట్రామా కేర్ సెంటర్ ను పునరుద్ధరించి దాని ద్వారా సేవలు అందించేందుకు అందుబాటులోకి తీసుకురావాలని వినతి పత్రంలో ప్రధాన అంశాలపై సమర్పించారు. వీటిపై మంత్రి సత్య కుమార్ సానుకూలంగా



స్పందించి వీలైనంత త్వరగా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలోరాష్ట్ర బిజెపి ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు బొల్లకాయల విజయ్ కుమార్, మాజీ జిల్లా కార్యదర్శి, సీనియర్ లాయర్ చెంచు కృష్ణయ్య, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొప్పాల సుబ్రహ్మణ్యం, సీనియర్ నాయకులు మధుసూదన్ రెడ్డి, విశ్రాంతి పోలీసు ఉద్యోగి శాంసన్, తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీల ఆస్తులు కబ్జా చేస్తారా? కూటమి ప్రభుత్వంపై

## మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి తీవ్ర ధ్వజం




**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 21**

"అధికారంలోకివస్తేవక్ఫ్ బోర్డుఆస్తులను కాపాడుతామని మాయమాటలు చెప్పిన కూటమి నేతలు, నేడు మైనార్టీల స్థలాలను ప్రభుత్వానికి ధారాదత్తం చేయడం ఘోరాతిఘోరం. స్వయంగా ప్రభుత్వమే మైనార్టీల హక్కులు, స్థలాలను కబ్జా చేసే దుస్థితికి దిగజారింది" అని నంద్యాల మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ నేత శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నంద్యాల పట్టణంలో కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ఎస్డీపీఐ ( ఎస్.డి.పి. ఐ ) ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి శిల్పా రవిరెడ్డి, వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషాతో కలిసి హాజరై సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

ఈ సందర్భంగా శిల్పా రవిరెడ్డి మాట్లాడుతూ కూటమి పాలనపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వైఎస్సార్సీపీ హయాంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి మైనార్టీల సంక్షేమం, విద్య కోసం ఎంతో కృషి చేశారు. అందులో భాగంగానే నంద్యాలలో ఉర్దూ కళాశాల వసతిగృహం భవనాలను నిర్మిస్తే, ఈ కూటమి ప్రభుత్వం వాటిని ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించుకోవాలని చూడటం దారుణం అన్నారు. వక్ఫ్ బోర్డు, మైనార్టీల స్థలాలను కేవలం వారి అభ్యున్నతికే ఉపయోగించాలి తప్ప ప్రభుత్వ అవసరాలకు వాడరాదన్నారు. అధికారం చేపట్టి రెండున్నరేళ్లు కాస్తున్నా ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వలేదు, కొత్త పెన్షన్ల ఊసే లేదు. రైతులకు 'రైతు భరోసా' ఎగ్గొట్టి వారిని రోడ్డున పడేసిన దౌర్భాగ్య ప్రభుత్వం అని తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనార్టీల హక్కులను కాలరాస్తూ, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ఈ కూటమి ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. బాధితులు, ప్రజాసంఘాలు చేసే ప్రతీ పోరాటానికి వైఎస్సార్సీపీ వెన్నుముకగా నిలుస్తుందని స్పష్టం చేశారు.

ఈ ధర్నా కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషా, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, రాష్ట్ర మహిళా విభాగం సెక్రటరీ శశికళ రెడ్డి, రాష్ట్రఎస్టీ సెల్ కార్యదర్శి ఆంజనేయులు మాజీ కౌన్సిలర్ తమిమ్, మాజీ కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, కిరణ్ కుమార్, గన్ని కరీం, జలీల్, వైఎస్సార్సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మైనార్టీ సంఘాల నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# 23న ఉచిత ఆయుర్వేద శిబిరం




**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 21**

ప్రపంచ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 23న కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక హాల్‌లో ఉచిత ప్రత్యేక ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు.

జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు సిబ్బంది తమ కుటుంబ సభ్యులతో కలిసి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. నిపుణులైన వైద్యులు నాడీ పరీక్ష, ఎముకల సాంద్రత, హెచ్‌బి, ఆర్‌బిఎస్ పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి ఉచిత ఆయుర్వేద మందులు అందజేస్తారు.ఆరోగ్యకరమైన జీవనశైలి, ఆహార నియమాలు, యోగా థెరపీ, పంచకర్మ చికిత్సా విధానాలపై అవగాహన కల్పించనున్నారు. వెన్ను, మెడ నొప్పులు, స్పాండిలైటిస్, మానసిక ఒత్తిడి తదితర సమస్యలపై నిపుణుల సలహాలు అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

# ప్రజాసేవే ధ్యేయంగా పనిచేయాలి

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 21**



ప్రభుత్వ ఉద్యోగులు ఎలాంటి స్వార్థం లేకుండా ప్రజాసేవే ప్రధాన ధ్యేయంగా నిస్వార్థంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. గతంలో పనులుజరగలేదని నిరుత్సాహపడకుండా, అనుభవాలను పాఠాలుగా తీసుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే దిశగా ముందుకు సాగాలని సూచించారు.

మహాకవి గురజాడ వెంకట అప్పారావు 164వ జయంతి సందర్భంగా సోమవారం నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళు లర్పించారు. గురజాడ రచనలు నేటికీ సమాజ చైతన్యానికి, సంస్కరణలకు స్ఫూర్తినిస్తున్నాయని అన్నారు. 'కన్యాశుల్కం', 'పుత్తడి బొమ్మ పూర్ణమ్మ' వంటి రచనలు సామాజిక రుగ్మతలు, బాల్య వివాహాలు, మహిళల సమస్యలపై ప్రజల్లో చైతన్యం కలిగించాయని పేర్కొన్నారు.

'దేశమును ప్రేమించుమన్నా' గేయంలోని సందేశం నేటికీ ఎంతో ప్రాసంగికమని, గురజాడ ఆశయాలను ఆచరణలో పెట్టి ప్రజలకు సేవ చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డిఆర్ఓ రామునాయక్, జిల్లాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్థానిక పోరుకు వైసీపీ శ్రేణులు సిద్ధం కావాలి: మాజీ మంత్రి నల్లపరెడ్డి.

**బుచ్చిరెడ్డిపాళెం: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని మాజీ మంత్రివర్యులు, వైసీపీ రాష్ట్ర పాక్ సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి పిలుపునిచ్చారు.. బుచ్చిరెడ్డిపాళెంలోని టీ .న్ . ఆర్. కళ్యాణమండపంలో మండల పార్టీ అధ్యక్షులు చెర్లో సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బుచ్చిరెడ్డిపాళెం రూరల్ మండల పార్టీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం, పార్టీ ఐడీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు..**

**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ సెప్టెంబర్ 21.**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలని, కూటమి ప్రభుత్వ విధానాలు, వైఫల్యాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామ, వార్డు స్థాయిలో ఇంటింటికీ వెళ్లి జగనన్న హయాంలో అమలైన సంక్షేమ పథకాలను ప్రజలకు



వివరించడంతో పాటు, ప్రస్తుత ప్రభుత్వ విధానాలపై పార్టీ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు.

పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తూ క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి కోరారు

అనంతరం ఈ నెల 24వ తేదీతో ఎంపీటీసీల పదవీకాలంముగియనున్న నేపథ్యంలో బుచ్చిరెడ్డిపాళెం మండలానికి చెందిన ఎంపీటీసీ సభ్యులను మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిశాలువాలతోసన్మానించారు.



ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వీరి చలపతిరావు, నియోజకవర్గ పరిశీలకులు కొండూరు అనిల్ బాబు, అప్లడా ఛైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, ఇందుకూరుపేట మండల పార్టీ అధ్యక్షులు మవులూరు శ్రీనివాసులురెడ్డి, విడవలూరు మండల పార్టీ అధ్యక్షులు కాటంరెడ్డి నవీన్ రెడ్డి, బుచ్చి మున్సిపాలిటీ వైసీపీ అధ్యక్షులు షేక్ షాహుల్, వైసీపీ సీనియర్ నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు,అనుబంధవిభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# నంద్యాలలో జెడ్పీ తాత్కాలిక కార్యాలయం

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబరు 21**

జిల్లా ప్రజా పరిషత్ కార్యకలాపాలను నంద్యాల నుంచే సజావుగా నిర్వహించేందుకు తాత్కాలిక కార్యాలయ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం నంద్యాలలోని ఎంపీడీఓ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఆడిట్ కార్యాలయ ప్రాంగణాలను పరిశీలించి అనువైన భవనం, మౌలిక వసతులను పరిశీలించారు. సెప్టెంబరు 24తో ప్రస్తుత జెడ్పీ పాలకవర్గం పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో, 25 నుంచి కలెక్టర్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు నిర్వహించనున్నారు. కర్నూలు నుంచి డిప్యూటీ సీఈఓ, అకౌంట్స్ ఆఫీసర్‌తో పాటు సుమారు 50 మంది సిబ్బంది నంద్యాలకు రానున్నందున వారికి అవసరమైన గదులు, మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి । చిత్తూరు । వై.ఎస్.ఆర్. కడప

# ఓడూరు భూ సమస్యలపై ఆర్డీవోకు ఫిర్యాదు

**గూడూరు, పెన్ పవర్, సెప్టెంబర్,21:**



చిల్లకూరు మండలం ఓడూరు గ్రామ రెవెన్యూ పరిధిలో ఎస్సీ లబ్ధిదారులకు 2018లో మంజూరైన సాగు భూములకు ఇప్పటి వరకు పూర్తిస్థాయి హద్దులు చూపించలేదని ఆరోపిస్తూ సోమవారం గ్రీవెన్స్‌లో గూడూరు ఆర్డీవోకు బాధితులు ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా ఏపీ ప్రజా కుల సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఎల్వి. సుబ్బయ్య మాట్లాడుతూ, నలుగురు ఎస్సీ లబ్ధిదారులకు భూములు మంజూరు చేసి పట్టాలు జారీ చేయడంతో పాటు రెవెన్యూ రికార్డుల్లో వారి పేర్లు నమోదు చేసినప్పటికీ, 2018 నుంచి హద్దులు చూపించకుండా కాలయాపన చేస్తున్నారని తెలిపారు. పలుమార్లు అధికారులను ఆశ్రయించినా సమస్య పరిష్కారం కాలేదన్నారు.

భూముల విషయంలో లోకాయుక్తలో ఫిర్యాదు చేయగా, సంబంధిత అధికారులు పూర్తి వివరాలు పరిశీలించకుండా లబ్ధిదారులు 30 సంవత్సరాలుగా భూములను సాగు చేయడం లేదంటూ నివేదిక సమర్పించారని సుబ్బయ్య ఆరోపించారు. ఈ నివేదికపై విచారణ జరిపి, లబ్ధిదారులకు తక్షణమే భూముల హద్దులు చూపించి న్యాయం చేయాలని, ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని, బాధ్యులైన రెవెన్యూ సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరారు.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

## పీవీ మోహన్‌ను కలిసిన తిరుపతి జిల్లా కాంగ్రెస్ మైనారిటీ అధ్యక్షులు ఫయాజ్

**గూడూరు, పెన్ పవర్, సెప్టెంబర్,21:**





ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల నూతన ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన పి.వి. మోహన్ తొలిసారిగా విజయవాడకు విచ్చేసిన సందర్భంగా తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ అధ్యక్షులు షేక్ నాయకుల ఫయాజ్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పి.వి. మోహన్‌తో కొద్దిసేపు సమావేశమై రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి, పార్టీ సంస్థాగత అంశాలపై చర్చించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ చైర్మన్ మస్తాన్ వలిని కూడా ఫయాజ్ కలిసి మాట్లాడారు.

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ సంస్థాగత బలోపేతం, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే అంశాలపై మస్తాన్ వలితో చర్చించినట్లు ఫయాజ్ తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆయన పేర్కొన్నారు.

పి.వి. మోహన్ పర్యవేక్షణలో రాష్ట్రవ్యాప్తంగా పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా ఫయాజ్ పిలుపునిచ్చారు.

# కోనూరు కృష్ణయ్యకు దండి నరేంద్ర ఘన నివాళి

## కష్టకాలంలో జనసైనిక కుటుంబాలకు అండగా నిలవడమే బాధ్యత: దండి నరేంద్ర




**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 21:**

శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకుడు దిలీప్ తండ్రి, జనసైనికుడు కోనూరు కృష్ణయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ నాయకుడు దండి నరేంద్ర తీవ్ర విచారం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న దండి నరేంద్ర రాచగున్నేరి గ్రామంలోని కృష్ణయ్య నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈసందర్భంగాదండినరేంద్రమాట్లాడుతూ..జనసైనికకుటుంబాలుసంతోషసమయంలోనేకాకుండాకష్టకాలంలోనూఅండగానిలవడంతనబాధ్యతగాభావిస్తున్నానని తెలిపారు. దిలీప్ కుటుంబానికి పార్టీ తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దండి నరేంద్ర తండ్రి, శ్రీకాళహస్తి మండల జనసేన



పార్టీ అధ్యక్షులు, శ్రీకాళహస్తీశ్వర ఆలయ బోర్డు సభ్యులు దండి రాఘవయ్య, జనసేన నాయకులుబొక్కిసంవెంకట్రామయ్య,రాజశేఖర్,సురేష్,సుజాతతదితరజనసైనికులు,బంధువులు,గ్రామస్థులు పాల్గొని కోనూరు కృష్ణయ్యకు ఘన నివాళులర్పించారు.

# వినాయకుని పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. పాశిం సునీల్ కుమార్





**గూడూరు, పెన్ పవర్, సెప్టెంబర్,21:**

గూడూరు పట్టణంలో వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ముత్యాలపేట ప్రాంతంలో జనసేన నాయకులు ఏర్పాటు చేసిన వినాయకుని పూజా కార్యక్రమంలో గూడూరు శాసనసభ్యులు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాశిం సునీల్ కుమార్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి వినాయకుని ఆశీస్సులు పొందారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల పట్టణంలోని పలు కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 21**

.పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అలాగే పలువురు స్థానిక ప్రజల ఇళ్లలో ఇటీవల జరిగిన మరణాలు, అనారోగ్య సమస్యల గురించి తెలుసుకున్న ఆయన నేరుగా వారి నివాసాలకు వెళ్లారు.

అనంతరం శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మరణించిన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కుటుంబ సభ్యులను ఓదార్చి, అధైర్యపడవద్దని ధైర్యం చెప్పారు.పార్టీ అండగా ఉంటుంది: వైఎస్సార్‌సీపీ కుటుంబంలో ప్రతి ఒక్క కార్యకర్తకు, నాయకుడికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని, ఏ కష్టం వచ్చినా పార్టీ పరంగా, వ్యక్తిగతంగా సహాయ సహకారాలు అందిస్తామని భరోసా కల్పించారు.





# ఉద్యోగాల పేరు తో కానిస్టేబుల్‌కుచ్చు టోపీ.

## 11లక్షల రూపాయలు మోసం.. బాధితుడు అవేదన




**గూడూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 21:**
చిల్లకూరు మండల పరిధిలోని తిక్కవరం గ్రామానికి చెందిన పచ్చా వెంకట రమణయ్య న్యాయం చేయండని వేడుకున్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా బాధితుడు పచ్చా వెంకట రమణయ్య మాట్లాడుతూ మా గ్రామానికి చెందిన జగన్నాటి మస్తానయ్య అనే హెడ్ కానిస్టేబుల్ మా దగ్గర హోమ్ గార్డ్ పోస్టులు ఉన్నాయని , వాటిని ఇప్పిస్తానను అని చెప్పి సుమారు 11 లక్షల రూపాయలను నాగేంద్ర అనే వ్యక్తికి ఫోన్ పే, బ్యాంకు అకౌంట్ కు వేయించాడని తెలిపారు. సుమారు సంవత్సరం కావస్తున్న నేటి కి ఉద్యోగాలు ఇప్పించలేదని వా పోయారు. మేము పలుమార్లు ఆయనను అడిగిన మీ దిక్కున్న చోటు చెప్పుకోండి అని చెప్పారు అన్నారు. పోలీస్ స్టేషన్ లకు తిరిగిన న్యాయం జరగలేదన్నారు. దయ చేసి మా డబ్బులను మాకు ఇప్పించాలని బాధితుడు వేడుకొన్నారు. అనంతరం సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి. శశి కుమార్ , సీపీఐ పట్టణ కన్వీనర్ సునీల్ మాట్లాడుతూ హోమ్ గార్డ్ఉద్యోగాలు ఇప్పిస్తాను అని చెప్పి తిక్కవరం గ్రామానికి చెందిన పచ్చా వెంకటరమణయ్య దగ్గర సుమారు 11లక్షల రూపాయలు ను కానిస్టేబుల్ జగన్నాటి మస్తానయ్య అనే వ్యక్తి నాగేంద్ర అకౌంట్ కి వేయించారని తెలిపారు. ఉద్యోగాలు ఇవ్వక పోగా బాధితులకు తిరిగి నగదు చెల్లించలేద్దన్నారు. ప్రజలు రక్షించాల్సిన పోలీస్ లే మోసానికి పాల్పడటం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు.
జిల్లా ఉన్నతాధికారులు స్పందించి బాధితుని కి న్యాయం చేయాలని తెలిపారు. లేని పక్షంలో సీపీఐ ఆద్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు సి. వి.ఆర్. కుమార్, పచ్చా వెంకటరమణయ్య, కిష్టమ్మ , తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు శ్రీ గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి ఎంపిక



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 21**
నంద్యాల పట్టణం బాబా నగర్ శ్రీ గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి పి.సాయికుమార్ జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లుగా స్కూల్ డైరెక్టర్ పి షేక్షావలిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వారు మార్కాపురం జిల్లా మార్కాపురం పట్టణ నందు నిర్వహించిన సబ్ జూనియర్ విభాగంలో రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నందు పి .సాయికుమార్ పదో తరగతి విద్యార్థి స్టేట్ లెవెల్ లో అత్యున్నత ప్రతిభను కనబరిచి నేషనల్ లెవెల్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు అక్టోబర్ 5వ తేదీన చత్తీస్గఢ్ పట్టణం నందు నిర్వహించే నేషనల్ లెవెల్ బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నందు పాల్గొంటారని తెలిపారు సందర్భంగా సాయికుమార్ ను మరియు విద్యార్థి విజయానికి చక్కని శిక్షణ అందించిన బాల్ బ్యాడ్మింటన్ కోచ్ డి పి రాజు ని ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాలలో విద్యార్థులకు విద్య తో పాటు క్రీడలలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాము.

# ఘనంగా పోషణ మాసోత్సవాలు

## గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారంపై అవగాహన





**తొట్టంబేడు, పెన్ పవర్ , సెప్టెంబర్ 21:**
శ్రీకాళహస్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని తొట్టంబేడు మండలం కాసరం, గొట్టిపూడి అంగన్వాడీ కేంద్రాల్లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిదుర్గ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వం అందించే పోషణ కిట్లలోని పాలు, గుడ్లు, ఖర్జూరం, అటికలు తదితర పోషక పదార్థాలను క్రమం తప్పకుండా తీసుకోవాలని తెలిపారు. గర్భం దాల్చినప్పటి నుంచి శిశువుకు మూడేళ్ల వయస్సు వచ్చే వరకు తల్లి, బిడ్డకు సమతుల్యమైన పౌష్టికాహారం ఎంతో అవసరమని వివరించారు.
అంగన్వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన ద్వారా ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు తదితర ఆహార పదార్థాల్లో లభించే విటమిన్లు, పోషక విలువలపై గర్భిణీలు, బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం పౌష్టికాహార పదార్థాలను వారికి పంపిణీ చేశారు.
ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు యామిని, గీత, గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# చియ్యవరం జాతరలో దళితులకు పూజల హక్కు కల్పించాలి

## డీఎస్పీకి దళిత, ప్రజా సంఘాల వినతి



**తొట్టంబేడు,పెన్ పవర్ ,సెప్టెంబర్ 21:**
మండలంలోని చియ్యవరం గ్రామంలో ఈనెల 24న నిర్వహించనున్న పోలేరమ్మ జాతరలో దళితులు కూడా అందరితో సమానంగా పూజలు చేసుకునే అవకాశం కల్పించాలని కోరుతూ దళిత, ప్రజా సంఘాల నాయకులు డీఎస్పీకి వినతిపత్రం అందజేశారు.
జాతరలో దళితులను పూజలు నిర్వహించకుండా ఆంక్షలు విధిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. గ్రామంలో అంటరానితనం, వివక్షకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, గ్రామదేవత పూజల్లో ప్రతి ఒక్కరూ సమానంగా పాల్గొనేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.
రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కులకు విరుద్ధంగా వివక్ష చూపడం చట్టవిరుద్ధమని, స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళనకరమని నాయకులు పేర్కొన్నారు. దేవాలయాలు, గ్రామదేవతల పూజల్లో కులవివక్షకు తావులేకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ గౌరవ అధ్యక్షులు అంగేరి పుల్లయ్య, గంధం మణి, గురవయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మించల శివకుమార్, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ కార్యదర్శి ఎస్. జాకీర్, ఐఎఫ్‌టీయూ నాయకులు సురేష్, సమీర్, యానాది సంఘం రాష్ట్ర నాయకులు చందమామల కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ మీద అవగాహన



**- ఎస్పై ఉమా శంకర్ హెల్మెట్ మీద ప్రజలకి అవగాహన కల్పించడం కార్యక్రమం నిర్వహించారు**

**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ సెప్టెంబర్ 21.**
ఎస్పీ ఆదేశాల మేరకు బుచ్చిరెడ్డిపాలెం టోల్ ప్లాజా వద్ద హెల్మెట్ మీద అవగాహన కార్యక్రమం చేపట్టడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా హెల్మెట్ ధరించడం వల్ల ఉండే ఉపయోగాలు మరియు ధరించకపోవడం వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించడం జరిగినది. మరియు ట్రాఫిక్ రూల్స్ ను ఫాలో అవడం, లైసెన్స్, ఇన్సూరెన్స్ తదితర పత్రాలు కలిగి ఉండాలని బుచ్చిరెడ్డిపాలెం పోలీసు ప్రజలకు అవగాహన కల్పించడం జరిగినది సరైన పత్రాలు లేకపోతే ఫైన్ చేస్తామని అన్నారు

# కోట గురుకుల పాఠశాలను పునఃప్రారంభించాలి బహుజన యూత్ ఫోర్స్ డిమాండ్

**గూడూరు, పెన్ పవర్, సెప్టెంబర్,21**
కోటలోని బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను తిరిగి ప్రారంభించి, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను మరోచోటికి తరలించి విద్యార్థులకు, దళిత సమాజానికి న్యాయం చేయాలని బహుజన యూత్ ఫోర్స్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ.. గత రెండు నెలలుగా గురుకుల పాఠశాల మూసివేత చర్యను నిరసిస్తూ పోరాటం చేస్తున్నప్పటికీ న్యాయం జరగకపోవడంపై వారు అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులు వసతుల సమస్యలతో టీసీలు తీసుకుని వెళ్లిపోతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన విద్యా హక్కు కోసం కూడా పోరాటం చేయాల్సిన పరిస్థితి రావడం అన్యాయమని, దళితులకు విద్యను అందించే గురుకుల విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం దానికి విరుద్ధంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. ఒకే క్యాంపస్‌లో బాలురు, బాలికలను ఉంచడంపై అభ్యంతరాలు వ్యక్తం చేసినా పట్టించుకోలేదని, విద్యార్థులను ఇతర ప్రాంతాలకు తరలించడం వల్ల పలువురు చదువును మధ్యలోనే నిలిపివేసి వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పేరుతో ఒకే క్యాంపస్‌లో విద్యార్థులను ఉంచడం, బాలికలను అక్కడి నుంచి తరలించే పరిస్థితి ఏర్పడటంపైనైనా ప్రభుత్వం స్పందించాలని కోరారు. విద్యార్థులు ప్రశాంతంగా చదువుకునే వాతావరణం కల్పించేందుకు కోట గురుకుల పాఠశాలను పునఃప్రారంభించి, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను వేరే ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో




బహుజన యూత్ ఫోర్స్ గౌరవ సలహాదారులు మట్టిగుంట సురేంద్ర, కనుపూరు క్రిష్ణయ్య, మీడియా కోఆర్డినేటర్ పాకం చెన్నకేశవులు, లీగల్ అడ్వైజర్ దాసరి అశోక్ కాంబ్లే, కో కన్వీనర్లు షేక్ సుభాన్, ప్రవీణ్, షేక్ సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

# విశ్రాంతి విద్యుత్ శాఖ ఏడిఈ లింగారెడ్డి. జయరామిరెడ్డి మృతి



**నాయుడుపేట: పెన్ పవర్, సెప్టెంబర్ 21**
దీర్ఘకాలంగా విద్యుత్ శాఖలో ఏ ఈ గా విధులు నిర్వహించి, ఏ డి ఈ గా రైతులకు శాఖా పరంగా సేవలందించి, విశ్రాంతి ఉద్యోగిగా శేష జీవితం గడిపిన లింగారెడ్డి. జయరామిరెడ్డి (81)సోమవారం అనారోగ్య కారణంగా తుది శ్వాస విడిచారు. దొరవారి సత్రం, పెళ్ళకూరు, నాయుడుపేట, చిట్టమూరు, 33 ఏళ్లు విద్యుత్ శాఖలో విశిష్ట సేవలు అందించారు. సొంత మండలమైన దొరవారి సత్రంలోనే సుదీర్ఘకాలంగా14 ఏళ్ళు విధులు నిర్వహించి అందరి మన్ననలను పొందాడు. ఈయన మరణ వార్త విన్న ఆ శాఖ అధికారులు, ఆయనతో పనిచేసిన సిబ్బంది పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియలు బుధవారం మధ్యాహ్నం మూడు గంటల నుండి నాయుడుపేట పాత తాసిల్దార్ కార్యాలయ సమీపంలోని ఆయన నివాసం నుండి అంత్యక్రియల కార్యక్రమం జరుగుతుందని కుమారుడు భాను ప్రకాష్ రెడ్డి తెలియజేశారు.

# భారత్ విశ్వగురువుగా వెలగాలి.. ప్రధాని మోదీ సంకల్పం సాకారం కావాలి



**పుత్తూరు సిద్ధార్థ ఇన్‌స్టిట్యూషన్స్‌లో వైభవంగా 'భారత్ విశ్వగురు సంకల్ప సిద్ధి' మహాయాగం**
**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న జనసేన నాయకులు దండి రాఘవయ్య, దండి నరేంద్ర**





**శ్రీకాళహస్తి పెన్ పవర్, సెప్టెంబర్ 21:**
భారత్ విశ్వగురువుగా వెలగాలన్న సంకల్పం సాకారం కావాలని ఆకాంక్షిస్తూ పుత్తూరులోని శ్రీ సిద్ధార్థ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో 'భారత్ విశ్వగురు సంకల్ప సిద్ధి' మహాయాగం వైభవంగా కొనసాగుతోంది. సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ మహాయాగానికి వివిధ ప్రాంతాల నుంచి వేద పండితులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు.
శ్రీ సిద్ధార్థ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ డాక్టర్ కొండూరు అశోక్ రాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మహాయాగంలో 300 మందికి పైగా వేద పండితులు పాల్గొంటుండగా, 108 హోమగుండాలతో ప్రత్యేక యాగశాలను ఏర్పాటు చేశారు. దేవతామూర్తుల ప్రతిష్ఠ, భక్తులకు వసతి, అన్నదానం, తాగునీరు, పరిశుభ్రత తదితర ఏర్పాట్లు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.
ఈ సందర్భంగా జనసేన నాయకులు దండి రాఘవయ్య, దండి నరేంద్ర ప్రత్యేక పూజల్లో పాల్గొని యాగ కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. భారత్ ఆధ్యాత్మికంగా, ఆర్థికంగా, సాంకేతికంగా మరింత ఉన్నత స్థాయికి చేరుకుని ప్రపంచానికి మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు.
మహాయాగాన్ని అత్యంత వైభవంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న డాక్టర్ కొండూరు అశోక్ రాజు, శ్రీమతి ఇందిర వేణి, కుటుంబ సభ్యులను దండి నరేంద్ర అభినందించారు. వారి ఆత్మీయత, నిరాడంబరత, ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల అంకితభావాన్ని కొనియాడారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వర స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసి, స్వామివారి ఆశీస్సులు ఈ మహాయాగానికి లభించాలని ఆకాంక్షించారు.
దండి నరేంద్ర తండ్రి, శ్రీకాళహస్తీశ్వర ఆలయ బోర్డు సభ్యులు దండి రాఘవయ్యతో పాటు జనసేన నాయకులు బొక్కిసం వెంకట రామయ్య, రాజశేఖర్, స్వప్న తదితరులు, పెద్ద సంఖ్యలో భక్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.
"సంకల్పం దేశం కోసం.. యాగం ధర్మం కోసం.. భారత్ విశ్వగురువుగా ఎదగడమే లక్ష్యం" అని దండి నరేంద్ర పేర్కొన్నారు.

# తెలుగు సాహిత్యానికి గురజాడ మార్గదర్శిసామాన్యుల అభ్యున్నతే లక్ష్యంగా రచనలు.. వ్యవహారిక భాషకు పెద్దపీట




**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 21:**
సామాన్య ప్రజల అభ్యున్నతిని లక్ష్యంగా చేసుకుని మహాకవి గురజాడ అప్పారావు తన రచనల ద్వారా సామాజిక చైతన్యాన్ని రగిలించారని ఎస్‌వీఏ ప్రభుత్వ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ టి. గంగారాం అన్నారు. ఆధునిక తెలుగు సాహిత్యానికి గురజాడ అప్పారావు గొప్ప మార్గదర్శిగా నిలిచారని పేర్కొన్నారు. సోమవారం శ్రీకాళహస్తిలోని ఎస్‌వీఏ ప్రభుత్వ కళాశాలలో మహాకవి గురజాడ అప్పారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ టి. గంగారాం మాట్లాడుతూ.. పండిత భాషకు భిన్నంగా ప్రజల నిత్య జీవితంలో వినియోగించే వ్యవహారిక భాషకు సాహిత్యంలో గౌరవం కల్పించిన మహనీయుడు గురజాడ అని కొనియాడారు. ఆయన రచించిన కన్యాశుల్కం నాటకం తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు.
తెలుగు అధ్యాపకులు డాక్టర్ కే. సుబ్బారావు మాట్లాడుతూ గురజాడ రచించిన ప్రసిద్ధ దేశభక్తి గేయం తెలుగు ప్రజల్లో దేశభక్తి, సామాజిక బాధ్యత, మానవతా విలువలను పెంపొందించిందన్నారు. గురజాడ జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. గురజాడ తన రచనల ద్వారా స్త్రీలపై జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించి, సమాజంలో సంస్కరణల అవసరాన్ని చాటిచెప్పారని ఇతర వక్తలు పేర్కొన్నారు.



అనంతరం అధ్యాపకులు, విద్యార్థులు కలిసి సామూహికంగా దేశభక్తి గేయాన్ని ఆలపించారు.
ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కే. సుబ్బారావు, టి. నరసింహులు, డాక్టర్ కే. సాయి వెంకటేష్, డాక్టర్ సి. బాపనయ్య తదితరులతో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్ టీ సి ప్రయాణికుల బస్ స్టాప్ సమస్యకు పరిష్కారం చూపాలి

## రైల్వే స్టేషన్, హౌసింగ్ బోర్డు, మిట్టకండ్రిగ వద్ద బస్సులు ఆపాలి: తలపా దామోదరం రెడ్డి

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 21:**
శ్రీకాళహస్తి నుంచి తిరుపతి వైపు వెళ్లే ఏపీ ఆర్ టి సి బస్సులను శ్రీకాళహస్తి పట్టణ పరిధిలోని రైల్వే స్టేషన్, హౌసింగ్ బోర్డు, మిట్టకండ్రిగ ప్రాంతాల్లో నిలిపేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు శ్రీకాళహస్తి ఆర్ టీ సి డిపో మేనేజర్ రేవతికి వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రానికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు స్వామివారి దర్శనార్థం వస్తుంటారని తెలిపారు. దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులతో పాటు, తిరుపతికి ఉద్యోగం, వైద్యం, విద్య తదితర అవసరాల కోసం వెళ్లే ప్రజలు బస్సు స్టాప్‌ల సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.
ప్రధాన ప్రాంతాల్లో ఆర్ టి సి బస్సులు నిలపకపోవడంతో ప్రయాణికులు దూర ప్రాంతాల్లో దిగి తిరిగి ఆటోలు, ఇతర వాహనాలను



ఆశ్రయించాల్సి వస్తోందని, దీనివల్ల అదనపు వ్యయం, సమయ నష్టం జరుగుతోందని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, భక్తులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.
ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్, హౌసింగ్ బోర్డు, మిట్టకండ్రిగ వద్ద తిరుపతి వైపు వెళ్లే ఆర్ టి సి బస్సులకు స్టాప్‌లు ఏర్పాటు చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిపో మేనేజర్‌ను కోరారు.
వినతిపై డిపో మేనేజర్ రేవతి సానుకూలంగా స్పందిస్తూ సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి,



నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.
ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కరీముల్లా, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, రేణిగుంట మండల అధ్యక్షులు రాహుల్ రాయల్, శ్రీకాళహస్తి పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆంటోనీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాగూరయ్య, మునికృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# యానాదుల సంక్షేమం, అభివృద్ధి మనందరి బాధ్యత.. విద్య, మౌలిక వసతులకు పెద్దపీట

**ఐటీడీఏ (యానాది) 11వ పాలకమండలి సమావేశంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**
**రాష్ట్రంలోనే తొలిసారిగా కోవూరులో ప్రత్యేక డ్రైవ్ ద్వారా వెయ్యి మందికి ఆధార్ కార్డుల పంపిణీ**
**గిరిజన విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ.. అడ్మిషన్లు, ఖాళీ సీట్లపై అధికారులకు సూచనలు**
**గిరిజన గురుకులాల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.1.28 కోట్లు మంజూరు చేయాలని ఐటీడీఏ డైరెక్టర్‌కు విజ్ఞప్తి**
**బుచ్చిరెడ్డిపాళెంలో 'గిరిజన భవన' నిర్మాణానికి ప్రతిపాదన**
**అటవీ హక్కుల చట్టం ద్వారా గిరిజనుల భూములు వాస్తవంగా సాగులోకి రావాలని అధికారులకు దిశానిర్దేశం**





**కోవూరు పెన్ పవర్ సెప్టెంబర్ 21.**

కోవూరు నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న యానాదుల సంక్షేమం, వారి అభివృద్ధి బాధ్యత మనందరిపై ఉందని కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం నెల్లూరులో జరిగిన ఐటీడీఏ (యానాది) 11వ పాలకమండలి సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజనుల సంక్షేమం, విద్య, మౌలిక సదుపాయాలు, అటవీ హక్కుల చట్టం అమలు తదితర కీలక అంశాలపై ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులకు పలు సూచనలు చేశారు.

యానాదుల గడపకే సంక్షేమం ప్రత్యేక డ్రైవ్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యానాదుల కష్టాలను గుర్తించి, రాష్ట్రంలోనే తొలిసారిగా కోవూరులో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామని ఎమ్మెల్యే శ్రీమతి ప్రశాంతి రెడ్డి గారు తెలిపారు. దీని ద్వారా దాదాపు వెయ్యి మందికి ఆధార్ కార్డులు అందజేశామన్నారు. ఇంకా ఆధార్ లేక ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్న వారిని గుర్తించి, అధికారులు వారి నివాస ప్రాంతాలకే వెళ్లి అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. యానాదులు నివసించే ప్రాంతాల్లో కనీస మౌలిక సదుపాయాల కొరత ఉందని, సీఎస్‌ఆర్ నిధులతో ఇప్పటికే కొన్ని చోట్ల వసతులు కల్పించామని, మిగిలిన ప్రాంతాల్లోని సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

గిరిజన విద్యార్థుల విద్యపై ప్రత్యేక దృష్టి.. ఉత్తీర్ణత శాతం పెరగాలి

గిరిజన విద్యార్థుల విద్యాభ్యాసంపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించారు. కోవూరు పరిధిలోని 3 రెసిడెన్షియల్, 3 డే స్కాలర్ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంపై అధికారులను ఆరా తీశారు. కొడవలూరు ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ బాయ్స్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 320 సీట్లకు గానూ 202 మంది, ఇందుకూరుపేటలో 320కి 119 మంది మాత్రమే ఉండటంపై ప్రశ్నించారు. అలాగే, కొడవలూరు ఏకలవ్య స్కూల్‌లో 480కి గానూ 382 మందే ఉన్నారని, మౌలిక వసతుల లేమితో పాటు, అడ్మిషన్ల కోసం వచ్చే విద్యార్థులను వెనక్కి పంపుతున్నారన్న ఫిర్యాదులపై అధికారులను ప్రశ్నించారు. గతేడాది ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉండటంపై కూడా ఎమ్మెల్యే ఆరా తీశారు. ఉత్తీర్ణత శాతం పెంచేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

మౌలిక వసతులు, గిరిజన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు

కొడవలూరు, ఇందుకూరుపేట వెల్ఫేర్ రెసిడెన్షియల్ వసతి గృహాల కోసం 3.5 ఎకరాల స్థలం అవసరముందని, ఈ ప్రక్రియ త్వరలో పూర్తవుతుందని తెలిపారు. మూడు ఎస్టీ గురుకులాల్లో మౌలిక వసతుల కల్పన కోసం రూ.1.28 కోట్లు అవసరముందని, వెంటనే ఆ నిధులను మంజూరు చేయాలని ఐటీడీఏ డైరెక్టర్ కోరారు. అలాగే బుచ్చిరెడ్డిపాళెంలో నిరుపయోగంగా, శిథిలావస్థలో ఉన్న ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ స్కూలు భవనాన్ని తొలగించి, ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం అక్కడే నూతన 'గిరిజన భవనం' నిర్మించాలని ప్రతిపాదించారు. ఇక అటవీ హక్కుల చట్టం (2006) కింద నెల్లూరు జిల్లాలో ఉన్న భూములకు సంబంధించి, కేవలం భూమి హక్కు పత్రాలు (ల్యాండ్ టైటిల్స్ ) ఇవ్వడమే కాకుండా, ఆ భూమి వాస్తవంగా గిరిజనుల చేతుల్లో సాగులోకి (కల్టీవ్షన్ ) వచ్చేలా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు.

# ఫోర్జరీ దస్తావేజులతో భూముల అక్రమ ఎంట్రీలు రద్దు చేయాలి

## చిందేపల్లి దళిత రైతుల ధర్నా.. సమగ్ర విచారణకు తహసీల్దార్ హామీ







**ఏర్పేడు, పెన్ పవర్, సెప్టెంబర్ 21:**

చిందేపల్లి గ్రామానికి చెందిన దళిత రైతుల భూములపై ఫోర్జరీ దస్తావేజులు సృష్టించి ఆన్‌లైన్‌లో అక్రమంగా ఎంట్రీలు చేశారంటూ సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో దళిత రైతులు ఏర్పేడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ పి. రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ.. ఏర్పేడు మండలంలో పరిశ్రమలు, ఐఐటీ, ఐజర్ వంటి విద్యాసంస్థలు ఏర్పడటంతో భూముల విలువలు పెరిగాయని, దీంతో కొందరు అక్రమార్కులు దళిత రైతుల అనుభవంలో ఉన్న భూములపై కన్నేసి తప్పుడు పత్రాలు సృష్టించి ఆన్‌లైన్ ఎంట్రీలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అక్రమ ఆన్‌లైన్ ఎంట్రీలను వెంటనే రద్దు చేసి, తప్పుడు పత్రాలు సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళిత రైతులు ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములను ఇతరుల పేర్లపై ఎలా నమోదు చేశారో రెవెన్యూ అధికారులు స్పష్టం చేయాలని కోరారు. భూమి ఎవరి ఆధీనంలో ఉంది, పట్టాలు ఎవరి వద్ద ఉన్నాయి, ఎవరు సాగు చేస్తున్నారు అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాలని అన్నారు. కోనేరు రంగారావు కమిషన్ సిఫారసుల మేరకు దళితులు అనుభవంలో ఉన్న భూములకు హక్కులు కల్పించాలని కోరారు.

గతంలో చిందేపల్లి దళితులు పరిశ్రమలు, ఇళ్ల స్థలాల కోసం భూములు కోల్పోయారని, ప్రస్తుతం మిగిలిన కొద్దిపాటి భూములను కూడా కోల్పోయే పరిస్థితి రావడం ఆందోళనకరమన్నారు. దళితులకు శ్మశాన వాటికలు, శ్మశానాలకు వెళ్లే మార్గాలు, ఇళ్ల స్థలాలు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇళ్లులేని అర్హులైన దళితులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, భూములు కోల్పోయిన వారికి ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.భూ సమస్యపై సీపీఎం పోరాటం కొనసాగిస్తామని, అవసరమైతే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు రాష్ట్రస్థాయిలోనూ ఉద్యమాన్ని విస్తరిస్తామని నాగరాజు తెలిపారు.

తహసీల్దార్ హామీచిందేపల్లి రైతులు భూ సమస్యపై అర్జీ సమర్పించారని తహసీల్దార్ పి. రాజశేఖర్ తెలిపారు. సమస్యపై వెంటనే పూర్తిస్థాయి విచారణ చేపట్టి, ఫోర్జరీ దస్తావేజులు సృష్టించినట్లు తేలిన వారికి నోటీసులు జారీ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. చట్ట ప్రకారం నిజమైన అనుభవదారులకు న్యాయం చేస్తామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రంగయ్య, మండల అధ్యక్షులు మాసపల్లి నాగరాజు, నాయకులు వెంకటాద్రి, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు, చిందేపల్లి దళిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలి.

## జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్.





**పెన్ పవర్, సెప్టెంబర్ 21:**

సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో లిఅదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, డిఆర్ఓ నాగలక్ష్మి, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, లీగల్ సెల్ అథారిటీ ప్రతినిధి అడ్వకేట్ ఆనంద్ కుమార్, ల కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు మరింత అనేకంగా సేవలు అందించాలనే మంచి ఉద్దేశంతో డివిజనల్, మండల స్థాయిలలో పాటు జిల్లా కలెక్టరేట్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు తమ సమస్యలను మండల స్థాయి, డివిజన్ స్థాయి, జిల్లా స్థాయిలలో దరఖాస్తు చేసుకోవచ్చని కోరారు, ప్రజలు చేసుకున్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి తమ పరిధిలో ఉంటే తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో సంబంధిత విభాగానికి సిఫారసు చేసి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

మహబూబాబాద్ మండలం జామాండ్లపల్లి గ్రామానికి చెందిన కొణతం లలిత తనకు చెందిన రిజిస్ట్రేషన్ గల భూమి 22 ఎ నిషేధిత ఆస్తుల జాబితాలో ఉన్నదని తన యాజమాన్యానికి సంబంధించిన ధృవీకరణ పత్రాలు తన వద్ద ఉన్నాయని అధికారులు రికార్డులను పరిశీలించి 22 ఎ జాబితా నుండి తన భూమిని తొలగించాలని కోరారు.

గార్ల మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన ఇస్లావత్ దేవ్లా సీతారామ ప్రాజెక్ట్ క్రింద తన భూమి ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నారని అట్టి పరిహారం తన బ్యాంకు ఖాతాలో కాకుండా వేరొకరి బ్యాంకు ఖాతాలో జమచేయడం జరిగిందని అట్టి పరిహారాన్ని తనకు ఇప్పించగలరని కోరారు.

బయ్యారం మండలం జగత్రావు పేట కు చెందిన పాయం వాలమ్మ తనకున్న వ్యవసాయ భూమిలో ట్రాక్టర్ తొ చదును చేసుకుంటుంటే ఫారెస్ట్ అధికారులు అట్టి భూమి ఫారెస్ట్ భూమని సాగుచేసుకునేందుకు వీలు లేదని అడ్డు కుంటున్నారని తనకు తగిన న్యాయం చేసి తన భూమిని సాగు చేసుకునేందుకు వీలు కల్పించాలని కోరారు.ఈ సందర్భంగా ఈ రోజు నిర్వహించిన ప్రజావాణిలో వచ్చిన ( 120 ) దరఖాస్తులను సంబందిత శాఖల అధికారులకు పరిష్కారానికి ఆదేశించారు.ముఖ్యమంత్రి గారు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలి చేయాలన్నారు,జిల్లాలోని జిల్లా, డివిజనల్ , మండల కేంద్రాల్లో నీ, ప్రతి ఒక్క ఉద్యోగి బయోమెట్రిక్ విధానం ద్వారా తమ ముఖచిత్రాలతో కూడిన హాజరు వివరాలను ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని, క్రమం తప్పకుండా సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్ని విభాగాల ప్రధానఅధికారులను ఆదేశించారు,ప్రభుత్వ కార్యాలయాలలో ప్రజల సౌకర్యం నిర్వహించే ఇంటర్నెట్ సౌకర్యాలను తెలంగాణ టి ఫైబర్ ఇంటర్నెట్ సేవలు వినియోగించుకోవాలని ప్రభుత్వం సూచించినందున తమ కార్యాలయాలలో వర్క్ ఆర్డర్ వెంటనే ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.అనంతరం తొమ్మిదవ జాతీయ పోషణ మాసం మా అంగన్వాడి, మా బాధ్యత. సెప్టెంబర్ 9 నుండి అక్టోబర్ 9 వరకు జరిగే కార్యక్రమాల పోస్టర్లు ఆవిష్కరించారు.ఈ ప్రజావాణిలో డివిహెచ్ఓ డాక్టర్ కిరణ్ కుమార్, సిపిఓ,వి. శ్రీనివాసరావు, ఉద్యానవల్ల అధికారి జినుగు మరియన్న, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయచంద్ర, ట్రైబల్, ఎస్సీ, బిసి సంక్షేమ అధికారులు దేశీ రామ్ నాయక్, శ్రీనివాసరావు, శ్రీజ, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, జిఎం ఇండస్ట్రీ శ్రీమన్నారాయణ రెడ్డి, డిపిఓ రేవంత్, డిసిఓ, సర్దార్ సింగ్, ఎల్డీఎం యాదగిరి, ఇన్చార్జి వెల్ఫేర్ అధికారిని కె.శిరీష, డిఎస్ఓ రమేష్, డి ఎం సివిల్ సప్లై నరసింహారావు, ఎడి ల్యాండ్ సర్వే రికార్డ్స్ శ్రీనివాసులు, క్రీడల అధికారి జ్యోతి, ఎడి మైనింగ్ వెంకట రమణ, ఉపాధి కల్పనా అధికారి రజిత, మెప్మా డీఎంసి విజయ, ఫుడ్ ఇన్స్పెక్టర్ ధర్మేంద్ర, అడిషనల్ డిఆర్డిఓ మల్లీశ్వరి, జిల్లా ఆస్పత్రి సూపరెంటెంట్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రమేష్, ఇన్చార్జి డిఈఓ శ్రీరాములు, టిపిఓ సాయిరాం, జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, సూపరెంటెంట్లు మదన్ గోపాల్, రాజేష్, దామోదర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కోర్టు ఆవరణలో ఎస్బీఐ బ్రాంచ్ ప్రారంభం



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబరు 21**

నంద్యాల జిల్లా కోర్టు ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్బీఐ కొత్త బ్రాంచ్ ను జిల్లా జడ్జి అమ్మన్న రాజా సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాది, ఏపీ మార్క్ ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి రెడ్డి తులసిరెడ్డి, పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. కోర్టు ప్రాంగణంలో బ్యాంకు సేవలు అందుబాటులోకి రావడంపై న్యాయవాదులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

# దామరమడుగు లో విపిఆర్ నేత్ర బస్సు సేవలు ప్రారంభం






**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ సెప్టెంబర్ 21.**

రూరల్అధ్యక్షుడు బెజవాడ జగదీష్ ఆధ్వర్యంలోదావరమడుగులో విపిఆర్ నేత్ర బస్సు సేవలు ప్రారంభించారు టిడిపి సీనియర్ నాయకుడు కె.వి శేషయ్య మాట్లాడుతూ సర్వేంద్రియం నయనం ప్రధానం మనకు ఉండేటువంటి అన్ని అవయవాల కల్లా కంటి చూపు చాలా ప్రధానమైనది చిన్న చిన్న దృష్టి లోపాలు నెగ్లెజేశగా చూసి అవి పెద్దయిన తర్వాత ఆపరేషన్ కి దారితీస్తుంది అలా కాకుండా ప్రతి ఒక్కరికి బడుగు బలహీన దళిత మైనారిటీ వర్గాలకు ఈ దృష్టిలోపాలను సవరించి వేల రూపాయలు ఖర్చు చేయడం పరిస్థితి నుంచి మీ ఇంటి వద్దకే మన గ్రామంలోని ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు నాణ్యత మైన అంతే నాణ్యత మైనటువంటి కంటి అద్దాలు ఉచితంగా ఉన్నటువంటి నిరంతర సేవా మూర్తులు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మన శాసన సభ్యురాలు ప్రియతమ నాయకురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు.

నిరంతరం విపిఆర్ అమృత ద్వారా దివ్యాంగ సేవ ఆసరా విపిఆర్ విద్య విపిఆర్ వైద్య వీపీఆర్ నేత్ర విపిఆర్ క్యాన్సర్ పరీక్షలు ఒకటారండా ఇలా చెప్పుకుంటా పోతుంటే వారి దాతృత్వం సేవ ప్రతి ఒక్క కార్నర్ గా ఉండే వారికి కూడా వారు ఏ సంకల్పంతో అయితే ఈ సేవ చేయాలో వారి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు ప్రతి ఒక్కరికి అందేలా అందుబాటులో ఉంచేలా చూడాలి ఈరోజు ప్రత్యేకంగా మూడు రోజులపాటు ఇదే ప్లేస్ లో మనకు దామరమడుగు గ్రామంలో ఉంటుంది ఒకరోజు పల్లెపాలెం మరో రోజు ఆర్ఆర్ నగర్ లో ఉంటుంది ఈరోజు కూడా మీకు ఆటో ద్వారా మీకు సంబంధించిన అనౌన్స్మెంట్ చేస్తున్నారు ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డుతో వచ్చి మొబైల్ నెంబరు తో తెచ్చుకుంటే నమోదు చేయించుకుని ఇక్కడ పరీక్ష చేయించుకొని వెంటనే మీకు అరగంటలో కళ్లద్దాలు అందజేస్తారు ఈ కార్యక్రమానికి హాజరైనటువంటి పెద్దలు గ్రామస్తులు మరియు అధికారులందరికీ కూడా ధన్యవాదాలు తెలిపారు.

# నిర్మల్ పట్టణంలో రేపు 9వ రోజు జరిగే గణేష్ శోభాయాత్రకు పటిష్ఠ భద్రత



- గుల్జార్ మజీద్ ప్రాంతంలో శోభాయాత్ర మార్గాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్





**పెన్ పవర్, సెప్టెంబర్ 21:**

నిర్మల్ పట్టణంలో రేపు నిర్వహించనున్న 9వ రోజు గణేష్ శోభాయాత్రను దృష్టిలో ఉంచుకుని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ గుల్జార్ మజీద్ ప్రాంతంతో పాటు శోభాయాత్ర కొనసాగే ప్రధాన మార్గాలను పరిశీలించారు.

శోభాయాత్ర ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జరిగేలా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని పోలీస్ అధికారులకు ఎస్పీ సూచించారు. ప్రధాన కూడళ్లు, సున్నిత ప్రాంతాలు, శోభాయాత్ర మార్గాల్లో బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షించారు.

శోభాయాత్ర సమయంలో పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి సమన్వయంతో విధులు నిర్వహించాలని, ఎలాంటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. గణేష్ మండపాల నిర్వాహకులు, భక్తులు పోలీసులకు సహకరించి శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ తో పాటు నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐ సమ్మయ్య, ఎస్ఐలు శ్రీకాంత్, జాఫర్, సాయి సిద్ధార్థ్, ఆర్ఎస్ఐ ఎం. రవి తదితరులు పాల్గొన్నారు.

# రైతులను ఆదుకోవాలనీ డిటి పఠాన్ బాబు కు వినతి పత్రం సమర్పించిన బిజెపి మండల ప్రధాన కార్యదర్శి పి ప్రవీణ్ కుమార్





**పెన్ పవర్, సెప్టెంబర్ 21:**

పాములపాడు మండలంవర్షాభావ పరిస్థితులతో పాములపాడు మండలంలోని, రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించి, రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని బిజెపి మండల అధ్యక్షులు రాయపాటి మురళీమోహన్, పి.ప్రవీణ్ కుమార్ తదితర నాయకులతో కలిసి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో డిప్యూటీ తహసిల్దార్ పఠాన్ బాబు, అగ్రికల్చర్ ఏవో ఎం.వెంకట మహేశ్వర్ రెడ్డి లకు వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షులు రాయపాటి మురళీమోహన్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల కారణంగా మండలంలోని వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతిన్నదన్నారు. వర్షాలను నమ్ముకుని పంటలు సాగు చేసిన రైతులు పెట్టుబడులు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. మరోవైపు తగిన వర్షాలు లేక కొంతమంది రైతులు పంటలు సాగు చేయలేకపోయారని పేర్కొన్నారు.

మండలంలోని, పలు ప్రాంతాల్లో పంటల పరిస్థితిని పరిశీలించి, వాస్తవ పంట నష్టాన్ని అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో అంచనా వేయాలని ఆయన కోరారు. రైతుల పంట నష్టాన్ని శాస్త్రీయంగా నమోదు చేసి, అర్హత ఉన్న రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం తక్షణ సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

రైతులకు రుణమాఫీ, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం అందించడంతో పాటు పశువులకు అవసరమైన పశుగ్రాసాన్ని కూడా అందించాలని రాయపాటి మురళీమోహన్ ప్రభుత్వాన్ని కోరారు.

కరువు పరిస్థితులపై వర్షపాతం, పంటల సాగు విస్తీర్ణం, పొడి పరిస్థితులు, పంట నష్టం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని మండల స్థాయిలో కరువు పరిస్థితిని అంచనా వేయడానికి ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపడుతోంది.

రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి పాములపాడు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, రైతులకు అవసరమైన అన్ని రకాల సహాయ చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి ప్రధాన కార్యదర్శులు పి.ప్రవీణ్ కుమార్, ఆర్. గోపాలకృష్ణయ్య మరియు బిజెపి నాయకులు వెంకటేశ్వర్లు, మల్లికార్జున, రామాంజనేయులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడ శాప్ కార్యాలయం వద్ద భారీగా వైయస్ఆర్‌సీపీ శ్రేణులు నిరసన

## నిరసనలో పాల్గొన్న జగ్గయ్యపేట నియోజకవర్గం ఇంచార్జి తన్నీరు నాగేశ్వరరావు







**పెన్ పవర్, సెప్టెంబర్ 21:**

డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో అక్రమ నియామకాల్ని ప్రశ్నిస్తూ.. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వైయస్ఆర్‌సీపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు ..

ఎక్కడికక్కడ పోలీసులు బారికేడ్లు పెట్టి ఆంక్షలు పెట్టినా.. అడ్డంకులను దాటుకుని శాప్ కార్యాలయం వద్దకు భారీగా చేరుకున్న పార్టీ శ్రేణులు ...

డీఎస్సీ పరీక్ష రాయకుండా... స్పోర్ట్స్ కోటాలో అక్రమ దారిలో టీచర్ ఉద్యోగాలు పొందిన వారు - టెన్త్ క్లాస్ విద్యార్థులకు సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్ట్స్ ఎలా బోధిస్తారు ??...

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందినవారు - విద్యార్థులకు సైన్సు, మ్యాథ్స్ లాంటి సబ్జెక్టులు బోధిస్తే -- విద్యార్థుల భవిష్యత్తు ఏం కావాలి ??... కష్టపడి సక్రమంగా ఉద్యోగాలు సాధించిన వారిని మేము ఏమి అనడం లేదు... అక్రమ దారిలో, స్పోర్ట్స్ కోటా పేరుతో ఫేక్ సర్టిఫికెట్స్ తో ఉద్యోగాలు పొందిన వారి గురించే మేము ప్రశ్నిస్తున్నాం ??

శాప్ ఆఫీసు ఎదుట బైఠాయించి.. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్.

శాప్ కార్యాలయం ముట్టడికి బయలుదేరిన మమ్మల్ని పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. భారీగా బందోబస్తు ఏర్పాటు చేసి, బారికేడ్లు పెట్టి నిరసనకారులను ముందుకు వెళ్లకుండా అడ్డుకున్నారు. వాహనాలను అనుమతించకపోవడంతో కొంతదూరం కాలినడకన వెళ్లి నిరసన చేపట్టాం. ఈ సందర్భంగా బస్సుపైకి ఎక్కి ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా వైసీపీ శ్రేణులు నిరసన తెలిపారు...

డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలపై తీవ్ర ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం సమగ్ర విచారణకు ముందుకు రావాలి. అవసరమైతే సీబీఐ విచారణ జరిపించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలి....

శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న మమ్మల్ని అడ్డుకోవడం, కేసులు పెట్టడం ద్వారా మా ప్రశ్నలను ఆపలేరు. డీఎస్సీ అభ్యర్థుల పక్షాన నిలబడటం మా బాధ్యత...

స్పోర్ట్స్ కోటా నియామకాలపై వస్తున్న ఆరోపణలపై నిజానిజాలు తేలే వరకు మా పోరాటం కొనసాగుతుంది. అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు.

యువత భవిష్యత్తు కోసం..

డీఎస్సీ అభ్యర్థుల న్యాయం కోసం.. మా పోరాటం కొనసాగుతుంది అని తెలియచేసారు.

## ప్రతి గ్రామంలో వైఎస్ఆర్ సీపీ జెండా ఎగరాలి : తన్నీరు నాగేశ్వరరావు

## కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలి.

**పెనుగంచిప్రోలు మండల ఎన్నికల సన్నాహక సమావేశంలో తన్నీరు నాగేశ్వరరావు**






**పెన్ పవర్, సెప్టెంబర్ 21:**

పెనుగంచిప్రోలు:రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని ప్రతి గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలని, పార్టీ శ్రేణులు సైనికుల్లా క్రమశిక్షణతో, ఐక్యంగా పనిచేయాలని జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్‌ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.

జగ్గయ్యపేట నియోజకవర్గం పెనుగంచిప్రోలు మండలం పెనుగంచిప్రోలు గ్రామంలోని రాధాకృష్ణ కళ్యాణ మండపంలో మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సన్నాహక సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు పొన్నం కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా తన్నీరు నాగేశ్వరరావు పాల్గొని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

ఏ గ్రామాన్నీ వదలొద్దు.. ప్రతి గ్రామంలో పార్టీ అభ్యర్థులు పోటీ చేయాలి

మండలంలోని ప్రతి గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున అభ్యర్థులు పోటీ చేసేలా నాయకులు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో పనిచేయాలని తన్నీరు నాగేశ్వరరావు సూచించారు. ఎక్కడా ఏకగ్రీవాలకు తావులేకుండా పార్టీ బలాన్ని ప్రతి గ్రామంలో చూపించాలని అన్నారు.

ఎంపీటీసీ, పంచాయతీ, జడ్పీటీసీ సహా స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

ప్రజా సమస్యలపై ప్రతి రచ్చబండలో చర్చ జరగాలి

కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గ్రామస్థాయిలో ప్రజల ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. ప్రతి గ్రామంలో రచ్చబండ తరహాలో ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని, వాటిపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని సూచించారు.

ప్రజలకు ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరుపై గ్రామాల్లో విస్తృతంగా చర్చ జరగాలని, ప్రజల్లో ఉన్న అభిప్రాయాలను స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యక్తమయ్యేలా పార్టీ శ్రేణులు ప్రజల్లోకి వెళ్లాలని అన్నారు.

నాడు జగన్ సంక్షేమం.. నేడు ప్రజల కష్టాలు

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను మరోసారి ప్రజలకు వివరించాలని తన్నీరు నాగేశ్వరరావు అన్నారు.

పేదలు, మహిళలు, వృద్ధులు, రైతులు, విద్యార్థులు తదితర వర్గాలకు గత ప్రభుత్వ హయాంలో అందిన సంక్షేమాన్ని ప్రజలకు గుర్తు చేస్తూ, ప్రస్తుత పరిస్థితులతో ప్రజలు స్వయంగా బేరీజు వేసుకునేలా వివరించాలని సూచించారు.

పార్టీ సభ్యత్వం.. ప్రతి గ్రామంలో పండుగలా కార్యక్రమాలు

ప్రతి గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యత్వాన్ని విస్తృతంగా చేపట్టి, సభ్యత్వ కార్డులను మంజూరు చేయాలని అన్నారు. ప్రతి గ్రామంలో పార్టీ కార్యకర్తలు, అభిమానులతో పండుగ వాతావరణంలో సభ్యత్వ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం పెంచుకుని, గ్రామస్థాయి నుంచి మండలస్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేయాలని అన్నారు.

పెన్షన్లపై ప్రజలకు వాస్తవాలు వివరించాలి.

పెన్షన్ల విషయంలో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలు, తమ పార్టీ చేస్తున్న విమర్శలను గ్రామస్థాయిలో ప్రజలకు వివరించాలని తన్నీరు నాగేశ్వరరావు అన్నారు.

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు, సామాజిక భద్రతా పింఛన్లు పార్టీ, కుల, మత భేదాలు లేకుండా అర్హత ఆధారంగా అందించామని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పెన్షన్ల పంపిణీపై ప్రజలు ఎదుర్కొన్న సమస్యలను గ్రామాల్లో చర్చించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

"ప్రతి ఎంపీటీసీ.. ప్రతి పంచాయతీ.. ప్రతి జడ్పీటీసీపై వైఎస్ఆర్ సీపీ జెండా ఎగరాలి"

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఎంపీటీసీ, ప్రతి పంచాయతీ, ప్రతి జడ్పీటీసీలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కష్టపడాలని తన్నీరు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.

"రాబోయే రోజులు మనవే అనే నమ్మకంతో కాదు.. ప్రజల్లోకి వెళ్లి, ప్రజల సమస్యలపై పోరాడి, కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేసి విజయాన్ని సాధించాలి" అని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి నాయకుడు, కార్యకర్తకు అండగా ఉంటామని, గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యమని అన్నారు.

ఈ కార్యక్రమంలో జడ్పిటిసి వూట్ల నాగమణి, ఎంపీపీ మార్కపుడి గాంధీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, మండల నాయకులు, గ్రామ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు మూడుప్రజావాణికి ఐదు శాఖల అధికారులు మాత్రమే హాజరు. మిగతా శాఖలకు సంబంధించిన అధికారులు గైర్హాజరు.





**పెన్ పవర్, సెప్టెంబర్ 21:**

చింతపల్లి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మూడు దరఖాస్తులు అందాయని మండల అభివృద్ధి అధికారి సుజాత తెలిపారు. రెవెన్యూ శాఖకు సంబంధించి భూముల విషయంలో అవకతవకలు జరిగాయని నసర్లపల్లి గ్రామం నుండి రెండు వినతులు ఇడమోని కనకమ్మ, షేక్ జహంగీర్ అందించగా పంచాయతీ రాజ్ (రోడ్డు)కు సంబంధించి ఒక వినతి చింతపల్లి ఎక్స్ రోడ్డు నుండి సలీం పాష అందించారు.సమస్యల పరిష్కారం కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, త్వరలో పరిష్కరిస్తామని మండల అభివృద్ధి అధికారి సుజాత, తహసిల్దారు విజయలక్ష్మి తెలిపారు. సమస్యల పరిష్కారానికి మండలంలోని వివిధ గ్రామాల నుండి వినతులు తీసుకుని ప్రజావాణికి అర్జిదారులు పరిష్కరిస్తారని వస్తే సంబంధిత అధికారులు గైర్హాజరు కావడం వలన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## కళాకారులకు అండగా ఉంటా...

## కన్యాశుల్కం నాటక ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొన్న కంబాల





**పెన్ పవర్, సెప్టెంబర్ 21:**

కళలకు, కళాకారులకు తాను ఎప్పుడు అండగా ఉంటానని, విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి సమితి సౌజన్యంతో, అభ్యుదయ కవితా పితామహుడు, నవయుగ వైతాళికుడు కీ.శే. గురజాడ అప్పారావు 164వ జయంతి పురస్కరించుకొని, కాకినాడలోని ది యంగ్ మాన్స్ హ్యాపీ క్లబ్, ఆధ్వర్యంలో దంటు కళాక్షేత్రంలో 'కన్యాశుల్కం' నాటకం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కంబాల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమం ప్రారంభించి, గురజాడ అప్పారావు చిత్రపటానికి నివాళులర్పించారు. తొలిత కంబాల శ్రీనివాసరావుకి నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. శాలువాకప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించి, మెమెంటో అందించారు. ఈ సందర్భంగా శౌరినేని కిషోర్ దర్శకత్వంలో, విష్ణుములకల రామకృష్ణ (నవయుగ ఫైన్ ఆర్ట్స్, విజయనగరం) నిర్వహణలో గురజాడ అమర సృష్టి 'కన్యాశుల్కం' నాటకాన్ని 8:00 గంటల సుదీర్ఘ నిడివితో యథాతథంగా ప్రదర్శించారు. ఈ ప్రదర్శన కళాభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయ, కళలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. తెలుగు జాతికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన 'కన్యాశుల్కం' వంటి గొప్ప నాటకాలను, మన ప్రాచీన నాటక కళను ముందు తరాలకు పదిలంగా అందించాల్సిన గురుతర బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉంది" అని పిలుపునిచ్చారు. కళాకారులకు ప్రాణవాయువుగా నిలుస్తూ నాట ఆధునిక సమాజంలో సాంస్కృతిక వైభవాన్ని కాపాడేందుకు ముందుకు వస్తున్న 'ది యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్' నిర్వాహకులను, కళాకారులను ఆయన అభినందించారు. 'కన్యాశుల్కం' నాటక ప్రదర్శనకు తనవంతు సహకారంగా కంబాల శ్రీనివాసరావు రూ.లక్ష విరాళాన్ని అందించారు. కనుమరుగవుతున్న రంగస్థల కళను బతికించేందుకు మరియు కళాకారులకు భరోసానిచ్చేందుకు కంబాల శ్రీనివాసరావు అందించిన ఆర్థిక సాయంపై కళాభిమానులు, సాహిత్యవేత్తలు, నటులు హర్షం వ్యక్తం చేశారు. సంస్కృతి మరియు కళల పరిరక్షణలో కంబాల శ్రీనివాసరావు చూపిన, ఈ ముందడుగు భవిష్యత్తు తరాల్లో రంగస్థలం పట్ల ఆసక్తిని, చైతన్యాన్ని నింపుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాలగ్రామ లక్ష్మీప్రసన్న, యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షుడు దంటు భాస్కరరావు, కాకినాడ కన్వీనర్ గట్టి సత్యనారాయణ, నాటక పరిషత్తుల ప్రముఖులు బుద్దాల వేంకట రామారావు, ముత్తవరపు సురేష్ బాబు, రాయప్రోలు భగవాన్, వాడ్రేవు సుందర్రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత పూరి తండా-2 లో సిద్ధి వినాయక ఉత్సవాలు దిగ్విజయం



**పెన్ పవర్, సెప్టెంబర్ 21:**

ప్రశాంత పూరి తండా-2 గ్రామంలో సిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో గత కొద్ది రోజులుగా ఎంతో వైభవంగా నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాలు, ప్రసాదాల వేలం పాట మరియు నిమజ్జన మహోత్సవం ప్రశాంత వాతావరణంలో దిగ్విజయంగా ముగిశాయి.

స్వామివారి భక్తిశ్రద్ధల నడుమ సాగిన వేలం పాటలో భక్తులు పోటీపడి ప్రసాదాలను దక్కించుకున్నారు.మొదటి లడ్డు: రూ. 27,000/- (ఇస్లావత్ శ్రీను నాయక్)రెండవ లడ్డు: రూ. 11,500/- (ఇస్లావత్ విజయ్ నాయక్ కుటుంబం)దివ్య కలశం: రూ. 11,501/- (ఇస్లావత్ పరమేష్ నాయక్ - మాజీ ఉప సర్పంచ్)లడ్డు ప్రసాదాన్ని, కలశాన్ని దక్కించుకున్న భక్తులకు సిద్ధి వినాయక యూత్ ప్రతినిధులు, స్థానిక ప్రజా ప్రతినిధులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఆ విఘ్నేశ్వరుని దివ్య ఆశీస్సులతో తండా ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలు మరియు అష్టైశ్వర్యాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనునాయక్, మాజీ ఎస్టీ సెల్ అధ్యక్షులు శ్రీను నాయక్, వార్డ్ మెంబెర్ నర్సింహా, మాజీ ఉపసర్పంచ్ పరమేష్, యూత్ అధ్యక్షులు రాంకోటి, రాందాస్, రవి, భాస్కర్, చంద్ర, నరేష్, గోవింద్, కృష్ణ, సంతోష్, మోహన్, నిఖిల్, రాహుల్, ప్రవీణ్, తరుణ్, హరి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## ఉపాధ్యాయులపై దాడులు దురదృష్టకరం

**- క్రీడాకారుల ప్రతిభను కించపరచడం తగదు: టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా. ఎం. ఉమేష్‌రావు**




**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 21:**

విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద క్రీడా కోటాలో ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులపై జరిగినట్లు పేర్కొంటున్న దాడుల ఘటనపై టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా. ఎం. ఉమేష్‌రావు తీవ్రంగా స్పందించారు. క్రీడాకారుల ప్రతిభను, వారి కష్టార్జిత విజయాలను రాజకీయ వివాదాల్లోకి లాగడం సమంజసం కాదని అన్నారు.క్రీడా కోటాలో ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులు శాప్ కార్యాలయానికి వచ్చిన సమయంలో కొందరు వారిపై రాళ్లు, రాడ్లు, కోడిగుడ్లతో దాడికి ప్రయత్నించారని, అసభ్యకరమైన భాషతో రెచ్చగొట్టారని ఉమేష్‌రావు ఆరోపించారు. ఈ ఘటనకు వైసీపీ నేత దేవినేని అవినాష్, ఆయన అనుచరులే కారణమని ఆయన ఆరోపించారు. ఉపాధ్యాయులకు జరిగిన ఘటనపై తక్షణమే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


**క్రీడాకారులకు 3 శాతం రిజర్వేషన్‌ను గౌరవించాలి**

మెగా డీఎస్సీ-2025లో క్రీడా కోటా కింద 3 శాతం రిజర్వేషన్ ద్వారా నియామకాలు పొందిన క్రీడాకారుల ప్రతిభను గౌరవించాలని ఉమేష్‌రావు పేర్కొన్నారు. సంవత్సరాల తరబడి కఠోర సాధన చేసి సాధించిన పతకాలు, సర్టిఫికెట్లను అనుమానాస్పదంగా చిత్రీకరించడం క్రీడాకారుల మనోభావాలను దెబ్బతీస్తుందని అన్నారు.

**మహిళా క్రీడాకారులను అవమానించొద్దు**

మహిళా క్రీడాకారిణులు ఎన్నో కష్టాలు ఎదుర్కొని సాధించిన విజయాలను కూడా రాజకీయ విమర్శలకు ఉపయోగించవద్దని ఆయన కోరారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం సమాజ బాధ్యతగా భావించాలని సూచించారు. ఒక క్రీడా సర్టిఫికెట్ వెనుక సంవత్సరాల సాధన, త్యాగం, కన్నీరు, పట్టుదల ఉంటాయని ఉమేష్‌రావు అన్నారు. అర్హతా ప్రమాణాలను పూర్తి చేసి ఉద్యోగాలు పొందిన క్రీడాకారులపై నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని కోరారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అర్హత సాధించి ఉద్యోగాలు పొందడంలో నిబంధనలకు విరుద్ధం ఏమీలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, బీమాల భాస్కర్, డి.వి. నారాయణ, కోట చంద్రశేఖర్, చిల్లకూరు మణి, పూల శేఖర్, శంకరయ్య, గంగనపల్లి రమేష్, సులేమాన్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## కిరాణా మరియు బేకరీ షాపుల్లో తనిఖీలు గంజాయి, మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు



**పెన్ పవర్, సెప్టెంబర్ 21:**

రాజన్న సిరిసిల్ల జిల్లా: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ అండ్ గొల్లపల్లి బస్టాండ్ ఆవరణంలో కిరాణా షాపులు, బేకరీ షాపుల్లో పోలీసులు మరియు డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు నిర్వహించారు. వివరాల ప్రకారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కిరాణా షాపులు, బేకరీ, మరియు ఇతరత్రా షాపులలో గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలు అమ్మినట్లయితే షాపు యజమానుల పైన కఠినమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు, ఈ యొక్క తనిఖీల్లో డాగ్ స్క్వాడ్ బృందం తో కానిస్టేబుల్ సదుర్ల సతీష్ వారి వెంట ఉన్నారులి

## వెళ్లిరావయ్యా బొజ్జ గణపయ్యా:-మండల కేంద్రంలోని బలిజ వీధిలో భక్తిశ్రద్ధలతో గణనాథుడికి ఘనంగా వీడ్కోలు



**పెన్ పవర్, సెప్టెంబర్ 21:**

అన్నమయ్య జిల్లా మండల కేంద్రంలోని బలిజ వీధిలో వినాయక చవితి ఉత్సవాల అనంతరం గణనాథుడికి భక్తులు సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, వెళ్లిరావయ్యా బొజ్జ గణపయ్యా.. వచ్చే ఏడాది మళ్లీ రావయ్యాఅంటూ భక్తులు గణేశుడిని సాగనంపారు. ఈ కార్యక్రమంలో భక్తులు, నిర్వాహకులు, స్థానికులు పాల్గొన్నారు.నిమర్జనం సందర్భంగా కమిటీ సభ్యులు వీధి గ్రామ పెద్దలు యువత ఆధ్వర్యంలో అన్నదానం వితరణ చేశారు.

# లోకల్ పోల్స్ కు కాంగ్రెస్ రెడీ...

**విజయవాడ, సెప్టెంబర్ 21, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న కాంగ్రెస్ పార్టీ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను వేదికగా చేసుకుని పూర్వవైభవం సాధించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సారథ్యంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి పునర్నిర్మించే క్రమంలో 10 మంది సీనియర్ నేతలతో కూడిన రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ ని ఏర్పాటు చేయడం ఆసక్తికరంగా మారింది. ఈ కమిటీకి సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ పీసీసీ చీఫ్ ఎన్. రఘువీరారెడ్డిని ఛైర్మన్‌గా, మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలంను కన్వీనర్‌గా నియమించడం ద్వారా కాంగ్రెస్ తన పాత కాపులను, అనుభవజ్ఞులను మళ్లీ ప్రధాన స్రవంతిలోకి తెచ్చేందుకు తగిన వేదికను సిద్ధం చేసింది.ఈ తాజా నియామకాల్లో ప్రధానంగా ఆకట్టుకుంటున్న అంశం రఘువీరారెడ్డి రీ-ఎంట్రీ. రాష్ట్ర విభజన అనంతరం అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో పీసీసీ అధ్యక్షుడిగా పార్టీని నడిపిన ఆయన, గత కొంతకాలంగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటూ ఆధ్యాత్మిక, వ్యవసాయ కార్యక్రమాలకే పరిమితమయ్యారు. అయితే, రాయలసీమతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివాదరహిత నాయకుడిగా, సౌమ్యుడిగా ఆయనకున్న మంచి పేరును వాడుకోవాలని ఏఐసీసీ భావించింది. బిసి, యాదవ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నేతగా, ఉమ్మడి ఏపీలో కీలక మంత్రిత్వ శాఖలు నిర్వహించిన రఘువీరారెడ్డి నాయకత్వం.. సైలెంట్‌గా ఉన్న పాత కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపే అవకాశం ఉంది.ఈ 10 మంది సభ్యుల కమిటీ ప్రాథమిక విధి కేవలం టికెట్ల కేటాయింపు లేదా కార్యాలయ వ్యవహారాలకే పరిమితం కాదు. సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, మాజీ కేంద్ర మంత్రులు పల్లంరాజు, కిల్లి కృపారాణి, తులసిరెడ్డి, షేక్ మస్తాన్ వలి వంటి దిగ్గజాలతో కూడిన ఈ బృందం త్వరలోనే జిల్లాల పర్యటనలకు శ్రీకారం చుట్టనుంది. గత కొన్నేళ్లుగా వైసీపీ, టీడీపీల వైపు వెళ్లిన ద్వితీయ శ్రేణి నేతలను, కాంగ్రెస్‌తో అనుబంధం ఉన్న పాత కుటుంబాలను పరామర్శించడం, తీవ్ర అసంతృప్తితో ఉన్న క్షేత్రస్థాయి శ్రేణులను తిరిగి సొంత గూటికి రప్పించడమే ఈ కమిటీ ప్రధాన లక్ష్యంగా



కనిపిస్తోంది.రాజకీయ సమీకరణాల పరంగా చూస్తే, ప్రస్తుతం ఏపీలో తీవ్రమైన అధికార-ప్రతిపక్ష పోరు నెలకొంది. ఓవైపు వైఎస్ఆర్‌సీపీ తమ అభ్యర్థులను నిలబెట్టేందుకు కష్టపడుతున్న తరుణంలో, మరోవైపు కూటమి ప్రభుత్వంపై ఉండే సహజ వ్యతిరేకతను లేదా తటస్థ ఓటు బ్యాంకును ఆకర్షించడానికి కాంగ్రెస్‌కు ఇది అనుకూల సమయం. స్థానిక సంస్థల పోరులో పంచాయతీ, మండల, మున్సిపల్ స్థాయిలో బహుముఖ పోటీని సృష్టించడం ద్వారా, రాష్ట్రంలో కనీసం 10 నుండి 15 శాతం ఓటు బ్యాంకును తిరిగి సాధించవచ్చని పార్టీ అంచనా వేస్తోంది. వైఎస్సార్ వారసత్వం కార్డ్‌ను షర్మిల వాడుతుండగా, పాత కాంగ్రెస్ పునాదుల ను రఘువీరా బృందం బలోపేతం చేసే ప్రయత్నం చేస్తోంది.కాంగ్రెస్ బాటలో సవాళ్లు తక్కువగానేమీ లేవు. క్షేత్రస్థాయిలో పార్టీకి ఆర్థికంగా, అంగబలంతో అండగా నిలిచే నాయకత్వం దాదాపు కనుమరుగైంది. ఎన్నికల నిర్వహణ వ్యయం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో, గెలుపు గుర్రాలను వెతికి పట్టుకోవడం ఈ కమిటీకి అతిపెద్ద అగ్నిపరీక్ష. అలాగే రఘువీరారెడ్డి సుదీర్ఘ విరామం తర్వాత క్షేత్రస్థాయిలో ఎంతవరకు పర్యటించి, నేతలలో ఆత్మవిశ్వాసాన్ని నింపగలరనేది కూడా కీలకం. ఏది ఏమైనా, సరైన వ్యూహం లేకుండా ఎన్నికలకు వెళ్లే విధానానికి స్వస్తి పలికి, ముందుగానే పక్కా కసరత్తు ప్రారంభించడం కాంగ్రెస్ సాధించిన సానుకూల పరిణామంగానే చెప్పాలి. రఘువీరారెడ్డి నేతృత్వంలోని ఈ హైపవర్ కమిటీ ఏపీ కాంగ్రెస్‌కు ఎంతవరకు సంజీవని గా మారుతుందో వేచి చూడాలి. అధికారంలో ఉన్న కూటమిని, ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్ఆర్‌సీపీని తట్టుకుని స్థానిక పోరులో స్థానాలు గెలుచుకుంటేనే 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి ఏపీలో కాంగ్రెస్ పునరుజ్జీవనానికి పునాది పడుతుంది.

# జనసేన తీర్థానికి వైఎస్ఆర్‌సీపీ సీనియర్ల దూరమా?



**ఒంగోలు సెప్టెంబర్ 21, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్ఆర్‌సీపీ ప్రాధాన్యం క్రమంగా తగ్గుతున్న క్రమంలో, ఆ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు గుడ్‌బై చెబుతూ కొత్త దారులు వెతుక్కుంటున్నారు. విజయనగరం జిల్లా జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వైఎస్ఆర్‌సీపీకి రాజీనామా చేసిన వెంటనే నేరుగా టీడీపీ గూటికి చేరడం చర్చనీయాంశం అయింది. ప్రతిపక్షం నుంచి బయటకు వస్తున్న నేతలకు కూటమి రూపంలో రెండు వేదికలు అందుబాటులో ఉన్నప్పటికీ, మెజారిటీ నాయకులు జనసేన వైపు చూడకుండా కేవలం తెలుగుదేశం వైపే మొగ్గు చూపడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఈ పరిస్థితికి ప్రధాన కారణం జనసేనలో చేరిన తర్వాత లభిస్తుందనుకున్న ప్రాధాన్యత పై రాజకీయ నేతలకు ఉన్న అనుమానాలే. వైఎస్ఆర్‌సీపీ నుంచి బయటకు వచ్చి జనసేన తీర్థం పుచ్చుకున్న మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఉదంతం ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. రాయలసీమ , ప్రకాశం జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న బాలినేని వంటి సీనియర్ నేత జనసేనలో చేరినప్పటికీ, ఆయనకు క్షేత్రస్థాయిలో ఆశించిన స్థాయిలో ప్రాధాన్యత లభించడం లేదనే అభిప్రాయం ఉంది. పైగా ఒంగోలు పరిసర నియోజకవర్గాల్లో కూటమి భాగస్వామి అయిన టీడీపీ స్థానిక నేతలతో బాలినేనికి తరచూ విభేదాలు రావడం, కూటమి శ్రేణుల మధ్య ఘర్షణలు వాతావరణం నెలకొనడం వంటివి ఆయనకు మరింత ఇరకాటంగా మారాయి.జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పార్టీ విషయంలో అనుసరిస్తున్న కఠినమైన ఫిల్టరింగ్ విధానం కూడా ఈ వలసల వేగాన్ని తగ్గించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలోకి వచ్చే వారి విషయంలో పవన్ జాగ్రత్తలు వహిస్తున్నారు. గతంలో జనసేనను, పవన్ కళ్యాణ్‌ను వ్యక్తిగతంగా తీవ్రస్థాయిలో విమర్శించిన వైఎస్ఆర్‌సీపీ నేతలను, ,నియోజకవర్గాల్లో వివాదాస్పద ఇమేజ్ ఉన్న వారిని పార్టీలోకి చేర్చుకోవడానికి ఆయన సుముఖంగా లేరు. దీంతో పార్టీలోకి రావాలని ఆశపడే నేతలకు కనీసం గ్రీన్ సిగ్నల్ కూడా లభించని పరిస్థితి నెలకొంది. అధికారిక ప్రాధాన్యత , నియోజకవర్గాల్లో పట్టు సాధించే క్రమంలో టీడీపీయే సరైన వేదిక అని జంపింగ్ నేతలు భావిస్తున్నారు. పాత వైఎస్ఆర్‌సీపీ నేతలకు నియోజకవర్గ స్థాయి వ్యవస్థలపై, అధికారులపై ప్రభావం చూపగలిగే బలమైన కేడర్ అవసరం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని టీడీపీకి గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు బలమైన యంత్రాంగం ఉంది. జనసేన ఓటు బ్యాంకు బలమైనదే అయినప్పటికీ, నియోజకవర్గంలో రాజకీయం నడపాలంటే టీడీపీ అధికారిక చత్రం కింద ఉండటమే రక్షణ అని సీనియర్ నాయకులు లెక్కింపులు వేస్తున్నారు.జనసేన అంతర్గత నిర్మాణం, నిర్ణయాల ప్రక్రియ కూడా ఇక్కడ ఒక అంశంగా మారింది. పవన్ కళ్యాణ్ చుట్టూ ఉన్న కోటరీ , పరిమితమైన పార్టీ పదవుల కేటాయింపు వల్ల, కొత్తగా చేరే వైఎస్ఆర్‌సీపీ మాజీ సీనియర్లకు సముచిత స్థానం దక్కుతుందా లేదా అనే సంశయం ఉండిపోయింది. బాలినేని శ్రీనివాసరెడ్డి ఉదంతాన్ని చూసిన తర్వాత చాలామంది వైఎస్ఆర్‌సీపీ సీనియర్లు జనసేనలోకి వెళ్లి మూలన పడేకంటే, నేరుగా టీడీపీలోకి వెళ్లి తమ ఉనికిని చాటుకోవడమే మేలు అనే ముగింపునకు వచ్చినట్లు కనిపిస్తోంది. ఈ పరిణామాలు క్షేత్రస్థాయిలో జనసేన విస్తరణకు కొంత అడ్డంకిగా మారినప్పటికీ, స్వచ్ఛమైన ఇమేజ్ ఉన్నవారినే పార్టీలోకి తీసుకోకూడదనే పవన్ కళ్యాణ్ వ్యూహం సుదీర్ఘకాలంలో పార్టీ సిద్ధాంతానికి మేలు చేస్తుందని జనసేన వర్గాలు వాదిస్తున్నాయి. అయితే, ప్రతిపక్ష వైఎస్ఆర్‌సీపీ బలహీనపడుతున్న ఈ కీలక సమయంలో వలసొచ్చే బలమైన నేతలను ఆకర్షించడంలో జనసేన వెనుకబడితే, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని నిర్మించుకోవడం ఆ పార్టీకి అతిపెద్ద సవాలుగా మారే అవకాశముంది.

# కల్తీ నెయ్యి... అడ్డంగా దొరికినట్టేనా

**తిరుమల, సెప్టెంబర్ 21, పెన్ పవర్:** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ నెయ్యి వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వెల్లడించిన దర్యాప్తు వివరాలను పట్టుకుని వైఎస్సార్‌సీపీ చేస్తున్న ప్రచారం ఆ పార్టీకే రాజకీయంగా, నైతికంగా తీవ్రమైన సెల్ఫ్ గోల్‌గా మారుతోంది. సుకృతి ఫుడ్స్ ప్రమోటర్ కైలాష్ చంద్ మంగ్లాను అరెస్ట్ చేసిన ఈడీ.. టీటీడీకి సరఫరా చేసిన నెయ్యిలో పామాయిల్, పామ్ కెర్నల్ ఆయిల్, ఎంజీ-90, మైవాసెట్ సాఫ్ట్ 400 వంటి ప్రమాదకర రసాయనాలు కలిపారని స్పష్టం చేసింది. అయితే, ఇందులో జంతు కొవ్వు ప్రస్తావన లేదన్న ఒకే ఒక్క పాయింట్‌ను పట్టుకుని, చూశారా మేం జంతు కొవ్వు వాడలేదు, మాపై తప్పుడు ఆరోపణలు చేశారు అంటూ వైసీపీ నేతలు సంబరాలు చేసుకోవడం, ఊరట పొందుతున్నట్లు ప్రకటనలు విడుదల చేయడం తీవ్ర విస్మయానికి గురిచేస్తోంది.ఈ రకమైన సమర్థన ద్వారా ఐదేళ్ల తమ హయాంలో తిరుమలకు నకిలీ, విష రసాయనాల నెయ్యి సరఫరా జరిగిందన్న దారుణ సత్యాన్ని వైఎస్సార్‌సీపీ పరోక్షంగా నూటికి నూరు శాతం అధికారికంగా అంగీకరించినట్లయింది. ప్రాథమికంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అనేది ఒక ఆర్థిక నేరాల దర్యాప్తు సంస్థ మాత్రమే. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ పరిధిలో అక్రమ నగదు లావాదేవీలు, డొల్ల కంపెనీలు, కల్తీ సరుకు కొనుగోళ్ల ముసుగులో జరిగిన నిధుల మళ్లింపును నిగ్గుతేల్చడమే దాని పని. నెయ్యిలో జంతు కొవ్వు ఉందా, లేదా అనేది తేల్చాల్సింది ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ , ప్రత్యేక ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లు, కోర్టు పరిధిలోని సిట్ దర్యాప్తు మాత్రమే తప్ప, అది ఈడీ పరిధిలోని అంశం కాదు. అలాంటప్పుడు ఈడీ రిపోర్టులో జంతు కొవ్వు పేరు రాలేదని సంబరాలు చేసుకోవడం ప్రజల దృష్టిని మళ్లించే కుట్రే.ఈడీ మోపిన 230 కోట్ల అక్రమ దందా, ఫేక్ రికార్డులు, విషపూరిత కెమికల్స్‌తో కూడిన తయారీ ఆరోపణలను వైసీపీ పూర్తిగా ఒప్పేసుకున్నట్లే అవుతోంది. భారతీయ సంస్కృతిలో, హిందూ ధర్మంలో తిరుమల వేంకటేశ్వర స్వామికి సమర్పించే నైవేద్యం పవిత్రమైనది. దేశవిదేశాల నుంచి కోట్ల మంది భక్తులు పరమ భక్తితో స్వీకరించే లడ్డూ ప్రసాదంలో ఆవు నెయ్యి స్థానంలో రీఫైన్డ్ పామాయిల్, మోనోగ్లిజరైడ్స్ వంటి పారిశ్రామిక రసాయనాలను కలిపి అంటగట్టడం కలియుగ దైవానికి చేసిన క్షమించరాని మహాపచారం కాదా? మేము విష రసాయనాలు మాత్రమే వాడాము తప్ప జంతు కొవ్వు వాడలేదని వాదించడం ఎంతటి దిగజారుడుతనం? కల్తీ జరిగిందని నిర్ధారణ అయినప్పుడు, అది ఏ రూపంలో ఉన్నా భక్తుల మనోభావాలను, దైవ పవిత్రతను తీవ్రంగా దెబ్బతీసిన ఘోర నేరమే అవుతుంది.మనీలాండరింగ్ కోణంలో 230 కోట్ల కుంభకోణం జరిగిందని, అందులో 96 కోట్ల విలువైన కల్తీ రసాయన నెయ్యి ఒక్క కంపెనీ నుంచే సరఫరా అయిందని ఈడీ తేల్చింది. పాల సేకరణే లేని ఫ్యాక్టరీల నుంచి ట్యాంకర్ల కొద్దీ కెమికల్ లిక్విడ్ తిరుమల కొండపైకి చేరుతుంటే అప్పటి పాలకమండలి పెద్దలు ఏం చేస్తున్నారు? ఈ అక్రమ రవాణాలో టీటీడీ అధికారులకు, రాజకీయ పెద్దలకు అందిన ముడుపుల మాటేమిటి? శ్రీవారి భక్తుల మనోభావాలతో చెలగాటమాడి, ఆరోగ్యాన్ని పణంగా పెట్టి వేల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టిన ఈ ముఠాకు చట్టపరంగా పడే సాధారణ శిక్షలు సరిపోవు.

రూ.230 కోట్ల విలువైన కల్తీ నెయ్యి సరఫరా

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కోసం ఏకంగా రూ.230 కోట్ల విలువైన కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ప్రకటించిది. ఇది కేవలం వ్యాపారుల స్వార్థం మాత్రమే ఉందంటే సామాన్యులు కూడా నమ్మే పరిస్థితి లేదు. సుకృతి ఫుడ్స్ ప్రమోటర్ కైలాష్ చంద్ మంగ్లా, భోలే బాబా డెయిరీ విపిన్ జైన్ వంటి వ్యాపారులు నెయ్యి స్థానంలో పామాయిల్, కెమికల్స్ కలిపారన్నది సాంకేతిక ఆధారాలతో తేలింది. కానీ, నిత్యం కఠిన నిబంధనలు, ల్యాబ్ టెస్టులు, సెక్యూరిటీ ఉండే తిరుమల వంటి పరమ పవిత్ర పుణ్యక్షేత్రంలోకి ఏళ్ల తరబడి ఎలాంటి అడ్డంకులు లేకుండా ట్యాంకర్ల కొద్దీ విషపూరిత నెయ్యి ప్రవేశించిందంటే.. కచ్చితంగా త్యున్నత రాజకీయ అండదండలు లేకుండా ఇది సాధ్యమయ్యే పనేనా ?ఈ ప్రశ్నకు మరింత బలాన్ని చేకూరుస్తోంది టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వ్యక్తిగత సహాయకుడు కదూరు చిన్న అప్పన్న వ్యవహారం. నెయ్యి సరఫరా చేసే డెయిరీ కాంట్రాక్టర్ల వద్ద కిలో నెయ్యికి 25 చొప్పున కమీషన్ డిమాండ్ చేశారన్న అభియోగాలతో ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందం అప్పన్నను ఏ-24గా అరెస్ట్ చేసి జైలుకు పంపింది. లంచం ఇవ్వడానికి నిరాకరించిన డెయిరీలను నిబంధనల పేరుతో బెదిరించి బ్లాక్‌లిస్ట్‌లో పెట్టించడం, కమీషన్లు ముట్టజెప్పిన కంపెనీలకు రేట్లు పెంచి కాంట్రాక్టులు కట్టబెట్టడం, హవాలా ద్వారా కోట్లాది రూపాయల ముడుపులు అందుకోవడం వంటి అంశాలపై సిట్ ఆధారాలు సేకరించింది. పూరి గుడిసె నేపథ్యం ఉన్న ఒక సాధారణ పీఏ ఖాతాల్లోకి, బినామీ ఆస్తుల్లోకి కోట్ల రూపాయల నిధులు ఎలా చేరాయన్నది ఈ వ్యవహారంలో అసలు గుట్టును బయటపెడుతోంది.

**చైర్మన్ పీఏ ... చైర్మన్ చెప్పకుండా చేయగలడా?**

అయితే ఇక్కడే అసలైన రాజకీయ, పరిపాలనాపరమైన ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఒక చైర్మన్ పీఏ స్థాయి వ్యక్తి ఇంతటి మెగా కుంభకోణాన్ని సొంత పూచీకత్తుతో నడిపించగలడా? డెయిరీలను బెదిరించడం, టీటీడీ కొనుగోలు విభాగం అధికారులను ఆదేశించడం, టెండర్లలో నిబంధనలు మార్చేలా ఒత్తిడి తేవడం ఆయన ఒక్కడి వల్లే అయ్యే పనేనా? వైవీ సుబ్బారెడ్డి పేరును, ఆయన అధికారాన్ని వాడుకోకుండా బోర్డు పరిధిలోని వ్యవహారాలను ఒక పీఏ శాసించడం అసాధ్యమనేది బహిరంగ రహస్యం. గతంలో కల్తీ గురించి ఫిర్యాదులు, ల్యాబ్ నివేదికలు వచ్చినా బుట్టదాఖలు కావడం వెనుక తిరుమల పాలకమండలి పెద్దల మౌనమే రక్షణ కవచంగా నిలిచిందన్న విమర్శలు బలంగా ఉన్నాయి.ప్రస్తుతం సిట్ అప్పన్నను అదుపులోకి తీసుకుని విచారించగా, ఈడీ మాత్రం కైలాష్ మంగ్లా, విపిన్ జైన్ వంటి తయారీదారులను అరెస్ట్ చేస్తూ పీఎంఎల్ఏ చట్టం కింద మనీ ట్రయల్ ను ఛేదిస్తోంది. కల్తీ నెయ్యి వ్యాపారులు సృష్టించిన నల్లధనం ఎవరెవరి ఖాతాల్లోకి వెళ్లింది, ఎవరికి కమీషన్లుగా ముట్టింది అనే బ్యాంకింగ్, హవాలా లింకులు బయటకు వస్తే.. ఆ దర్యాప్తు ముగింపు అప్పన్న వద్దే ఆగిపోవడం అసాధ్యం. అప్పన్న ద్వారా ఆ ముడుపులు ఎవరి గడప దాటాయి, టీటీడీ అప్పటి ఉన్నతాధికారులు, బోర్డు చైర్మన్ కార్యాలయానికి దీనితో ఉన్న లంకె ఏమిటన్నది తేలక తప్పదు.

# 100 శాతం స్ట్రైక్ రేటుపై గురి

**కాకినాడ, సెప్టెంబర్ 21, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగబోయే మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి జనసేన పార్టీ అత్యంత పకడ్బందీ వ్యూహాన్ని రచిస్తోంది. పొత్తుల రాజకీయంలో సీట్ల సంఖ్య కోసం వెంపర్లాడే సాంప్రదాయ ధోరణికి భిన్నంగా.. పోటీ చేసిన ప్రతిచోటా గెలిచి తీరాలనే దృఢ నిశ్చయంతో అడుగులు వేస్తోంది. విశాఖపట్నంలో జరిగిన పార్టీ ఆత్మీయ సమావేశంలో పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ చేసిన వ్యాఖ్యలు జనసేన క్షేత్రస్థాయి వ్యూహాన్ని స్పష్టం చేశాయి. మనం తీసుకునే ప్రతిదీ గెలిచే సీటే తీసుకుందాం. కేడర్ నుంచి ఒత్తిడి ఉంది కదా అని గుడ్డిగా 60, 70 లేదా 120 సీట్లు తీసుకోము అని తేల్చిచెప్పడం ద్వారా.. సీట్ల సంఖ్య కంటే గెలుపు గుర్రాలపైనే పార్టీ పూర్తి దృష్టి పెట్టిందన్న స్పష్టమైన సంకేతాన్ని శ్రేణులకు ఇచ్చారు.సార్వత్రిక ఎన్నికల్లో 21 అసెంబ్లీ, 2 ఎంపీ స్థానాల్లో పోటీ చేసి 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించిన రికార్డును స్థానిక సమరంలోనూ పునరావృతం చేయడమే పార్టీ ప్రధాన అజెండాగా కనిపిస్తోంది. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తీవ్ర నిర్బంధాలు, బెదిరింపులను ఎదుర్కొంటూనే విశాఖ కార్పొరేషన్‌లో 3 వార్డులు గెలవడంతో పాటు 7 చోట్ల రెండో స్థానంలో నిలిచిన చరిత్రను పార్టీ గుర్తుచేసుకుంటోంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటం, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పాలనాపరమైన పనితీరు ప్రజల్లో సానుకూలతను పెంచిన వేళ.. క్షేత్రస్థాయిలో పార్టీకి తిరుగులేని పట్టున్న వార్డులు, డివిజన్లను గుర్తించి అక్కడ మాత్రమే పూర్తి బలంతో బరిలోకి దిగాలని అధినాయకత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.కూటమిలో భాగస్వామిగా ఉంటూ అనవసర డిమాండ్లతో సమన్వయాన్ని దెబ్బతీయకుండా, వాస్తవ బలాబలాల ఆధారంగానే సీట్ల సర్దుబాటు ఉండాలనేది జనసేన లైన్. ఏదో ప్రభావం చూపే స్థానంలో ఉన్నాం కదా అని మిత్రపక్షాలపై ఒత్తిడి తెచ్చి ఎక్కువ సీట్లు తీసుకోవడం.. ఆ తర్వాత సమన్వయం లేక లేదా అభ్యర్థుల బలహీనత వల్ల చేజేతులా ఓడిపోవడం వంటి తప్పులకు జనసేన తావివ్వదలుచుకోలేదు. స్థానిక సమస్యలపై పట్టు, ప్రజల్లో నిరంతరం ఉండే నాయకత్వం, గెలిచే సత్తా ఉన్న అభ్యర్థులు ఉన్న చోట మాత్రమే కూటమి తరఫున జనసేన సీట్లను క్లెయిమ్ చేయాలని నిర్ణయించింది. ఇది అటు కూటమి ఐక్యతను కాపాడటంతో పాటు, ప్రత్యర్థి వైఎస్సార్‌సీపీకి ఏ ఒక్క స్థానంలోనూ పట్టు చిక్కకుండా చేసే వ్యూహాత్మక ఎత్తుగడ.పార్టీ శ్రేణులకు నాయకత్వం ముందస్తు హెచ్చరికలు కూడా జారీ చేసింది. టికెట్ రాగానే గెలిచేసినట్లు భావించే అతివిశ్వాసం వద్దని, సోషల్ మీడియాలో వచ్చే అనవసర ప్రచారాలు, సీట్ల సంఖ్యపై సాగే చర్చలను పట్టించుకోవద్దని తేల్చిచెప్పింది. అధినేత పవన్ కళ్యాణ్ నిర్ణయమే తుది నిర్ణయమని, పార్టీ ఎక్కడ పోటీ చేసినా అక్కడ జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని కేడర్‌కు స్పష్టం చేశారు. సంఖ్యతో కూడిన డాంబికాల కంటే.. పోటీ చేసిన ప్రతి స్థానంలోనూ విజయకేతనం ఎగురవేసి అన్‌బీటెన్ బ్రాండ్‌ను కాపాడుకోవడమే జనసేన అసలైన స్థానిక మంత్రంగా కనిపిస్తోంది.

# పవన్ ఏం చెబుతారో... సర్వత్రా ఉత్కంఠ !



**హైదరాబాద్ పెన్ పవర్:** జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ నెల 22న కాకినాడ వేదికగా కీలకమైన పార్టీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశం స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జరుగుతోంది. దాంతో స్థానిక ఎన్నికల విషయంలో జనసేన వ్యూహాలు ఏమిటి ఆ పార్టీ పోటీ చేసే సీట్లు ఎన్నికల పొత్తులలో వ్యవహరించే విధానం మీద అంతటా ఆసక్తి అయితే ఉంది. ఎందుకంటే 2024 ఫార్ములాను జనసేన నేతలు ఇప్పటికే కాదు కూడదని చెప్పారని అంటున్నారు. అంతే కాదు 30 శాతం సీట్లు తమకు దక్కాలని కోరుకుంటున్నారు అని కూడా ప్రచారంలో ఉంది. అయితే అదే సమయంలో జనసేన అగ్ర నేత మంత్రి నాదెండ్ల మనోహర్ విశాఖలో జరిగిన పార్టీ సమావేశంలో మాట్లాడుతూ బలం ఉన్న చోటనే జనసేన పోటీ పడాలని సూచించినట్లుగా వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో జరుగుతున్న ఈ కీలక సమావేశం మీద అందరి ఫోకస్ ఉందిపుడు.

**తీవ్ర అసంతృప్తితో :**

ఇదిలా ఉంటే నాదెండ్ల మనోహర్ బలం ఉన్న చోట పోటీ పడాలని బాధ్యత కలిగిన పార్టీగా జనసేన వ్యవహరించాలని సూచించినట్లుగా ప్రచారం సాగింది. దీని మీద జనసైనికులు అయితే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు అని అంటున్నారు. ఎందుకంటే ఈసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని చాలామంది పెద్ద ఎత్తున ఉత్సాహం చూపిస్తున్నారు. ఈ తరహా ప్రకటనలు వారి ఆశల మీద నీళ్ళు చల్లుతున్నాయి. దాంతో ఈ పరిణామాల నేపథ్యంలో జనసేన అధినేత పవన్ వెంటనే ఒక అతి ముఖ్య సమావేశం ఏర్పాటు చేయడంతో పవన్ ఏమి చెబుతారు అన్నది అయితే చర్చకు వస్తోంది.

**పవన్ డెసిషన్ అంటే :**

ఇక చూస్తే పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ అధినేత హోదాలో ఏది చెప్పినా అదే ఫైనల్ అని అంటున్నారు. ఈసారి ఎక్కువ సీట్లు తీసుకుని కూటమితో కలసి పోటీ చేస్తామని పవన్ కనుక ప్రకటిస్తే ఆ లెక్క వేరే ఉంటుందని అంటున్నారు. ఎందుకంటే దశాబ్దం పైగా జనసేన నాయకులు కానీ క్యాడర్ కానీ పార్టీ కోసం ఎంతగానో శ్రమించారు అని ఇప్పుడు వారికి గ్రౌండ్ లెవెల్ లో అధికారం అందుకునే చాన్స్ వచ్చిందని అంటున్నారు. అదే విధంగా పార్టీలో క్షేత్ర స్థాయిలో ఆశలు ఆకాంక్షలకు పవన్ నిర్ణయాలు ప్రతిబింబిస్తాయని కూడా అనేక మంది భావిస్తున్నారు. అయితే జనసేన కూటమిలో అతి ముఖ్య భాగస్వామి. కాబట్టి ఆచీ తూచీ నిర్ణయాలు తీసుకునే అవకాశాలు ఉంటాయని అంటున్నారు. దాంతో బాలెన్స్ గానే జనసేన విధానాలు కానీ ఆలోచనలు కానీ ఉంటాయని చెబుతున్నారు. అలా కనుక చూస్తే ఏ రకమైన తీర్మానం వెలువడుతుంది అన్నది కూడా ఉత్కంఠను రేపేదిగా ఉంటుందని అంటున్నారు.

**కందులకు బాధ్యతలు :**

మరో వైపు చూస్తే జనసేన పార్టీకి సంబంధించి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రచార సారథ్యాన్ని కో ఆర్డినేట్ చేసుకునే కీలక భూమికను మంత్రి కందుల దుర్గేష్ కి పవన్ అప్పగించారు. దీంతో ఆయన మీద మరింత కొత్త భారాలు పెరిగాయని అంటున్నారు. సౌమ్యుడిగా ఉంటూ అందరికీ కలుపుకుని పోయే కందులకు జనసేన ప్రచార కమిటీ కో ఆర్డినేటర్ గాబాధ్యతలు అప్పగించడం పట్ల పార్టీలో హర్షం వ్యక్తం అవుతోంది అని అంటున్నారు. అలాగే జనసేన శ్రేణులను ఏకమొత్తంగా ముందుకు నడిపించే సామర్థ్యం ఆయనకు ఉందని అంటున్నారు. మొత్తం మీద చూస్తే చాలా కాలం తరువాత స్థానిక సంస్థల ఎన్నికల ముంగిట పవన్ కాకినాడలో తన పార్టీ శ్రేణులతో నిర్వహించే కీలక సమావేశం మీద జనసేన మాత్రమే కాదు ఏపీ రాజకీయ మొత్తం నిశితంగా చూస్తోంది అని అంటున్నారు.

## గోల్డ్ మెడల్ పోరులో భారత్ vs శ్రీలంక: ఆసియా గేమ్స్ ఫైనల్ మ్యాచ్ ఎప్పుడు, ఎక్కడ చూడాలంటే!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా గేమ్స్ 2026 మహిళల క్రికెట్ విభాగంలో అత్యంత కీలక ఘట్టం ఆసన్నమైంది. పసిడి పతకం కోసం డిఫెండింగ్ ఛాంపియన్ భారత మహిళల క్రికెట్ జట్టు శ్రీలంక మహిళల జట్టు (మంగళవారం, సెప్టెంబర్ 22) హోరాహోరీగా తలపడనున్నాయి. జపాన్‌లోని నిషిన్‌లో ఉన్న కోరోగీ స్పోర్ట్స్ పార్క్ వేదికగా ఈ చారిత్రాత్మక ఫైనల్ పోరు జరగనుంది.

**అద్భుత ప్రదర్శనతో ఫైనల్‌కు భారత్, లంక:**

భారత్ ఘన విజయం: బంగ్లాదేశ్‌తో జరిగిన సెమీఫైనల్‌లో ఓపెనర్ షెఫాలీ వర్మ కేవలం 49 బంతుల్లోనే అజేయంగా 100 పరుగులు చేసి రికార్డు సెంచరీతో విరుచుకుపడింది. దీంతో భారత్ 20 ఓవర్లలో 195/4 పరుగులు చేయగా.. బంగ్లాదేశ్‌ను 81 పరుగులకే ఆలౌట్ చేసి 114 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. ఇదే మ్యాచ్‌లో స్మృతి మంధాన మహిళల టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్‌గా ప్రపంచ రికార్డు సృష్టించింది.

శ్రీలంక ఊచకోత: పాకిస్థాన్‌తో జరిగిన మరో సెమీఫైనల్‌లో శ్రీలంక కెప్టెన్ చమరి అతపత్తు (50 బంతుల్లో 83 నాటౌట్) చెలరేగడంతో 178 పరుగుల భారీ లక్ష్యాన్ని కేవలం 2 వికెట్లు కోల్పోయి ఛేజ్ చేసింది.

**మరోసారి ఆసియా కప్ రిపీట్:**

ఈనెల ఆరంభంలో దుబాయ్‌లో జరిగిన మహిళల ఆసియా కప్ 2026 ఫైనల్‌లోనూ భారత్ వర్సెస్ శ్రీలంక జట్లే పోటీపడ్డాయి. ఆ మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించి ట్రోఫీ గెలుచుకుంది. ఇప్పుడు ఆసియా గేమ్స్ ఫైనల్లోనూ ఈ రెండు జట్లు తలపడతుండటం విశేషం. 2022 హ్యాంగ్‌జౌ ఆసియా గేమ్స్‌లో స్వర్ణం గెలుచుకున్న టీమిండియా, ఈసారి కూడా టైటిల్‌ను నిలబెట్టుకోవాలని పట్టుదలతో ఉంది. శ్రీలంక జట్టు ఆసియా గేమ్స్‌లో తమ తొలి క్రికెట్ గోల్డ్ మెడల్ సాధించాలని భావిస్తోంది.

**హెడ్ టు హెడ్ రికార్డు:**

మొత్తం మ్యాచ్‌లు: 32
భారత్ విజయం: 26
శ్రీలంక విజయం: 5
ఫలితం లేనిది: 1

**కీలక ఆటగాళ్లు:**

భారత జట్టు తరఫున ఫామ్‌లో ఉన్న షెఫాలీ వర్మ, స్మృతి మంధాన, కెప్టెన్ హర్మాన్‌ప్రీత్ కౌర్, ఆల్ రౌండర్ దీప్తి శర్మ మ్యాచ్ విన్నర్లుగా మారనుండగా.. శ్రీలంక జట్టు పూర్తిగా వారి స్టార్ కెప్టెన్ చమరి అతపత్తుపై ఆధారపడి ఉంది.

**మహిళల ఆసియా గేమ్స్ 2026 ఫైనల్ వివరాలు:**

తేదీ: సెప్టెంబర్ 22, 2026 (మంగళవారం)
సమయం: ఉదయం 10:30 గంటలకు (IST) (జపాన్ కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2:00 గంటలకు)
వేదిక: కోరోగీ స్పోర్ట్స్ పార్క్, నిషిన్, జపాన్
టీవీ ప్రసారం: భారత్‌లో Sony Sports Network ఛానెళ్లలో ప్రత్యక్ష ప్రసారం కానుంది.
లైవ్ స్ట్రీమింగ్: SonyLIV యాప్, వెబ్‌సైట్‌లో లైవ్ చూడవచ్చు.

# CSKలో సంచలన మార్పు.. జహీర్ ఖాన్‌కు హెడ్ కోచ్ బాధ్యతలు!






**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ సంచలన నిర్ణయం తీసుకుంది. తమ కొత్త హెడ్ కోచ్‌గా భారత మాజీ దిగ్గజ పేసర్ జహీర్ ఖాన్ ను నియమించింది. గత 18 ఏళ్లుగా సీఎస్కేతో సుదీర్ఘ అనుబంధం ఉన్న స్టీఫెన్ ఫ్లెమింగ్ ఆ పదవి నుంచి తప్పుకోవడంతో జహీర్ ఖాన్‌కు ఈ బాధ్యతలు అప్పగించారు.

**లెఫ్ట్ ఆర్మ్ టేకింగ్ ఓవర్.. సీఎస్కే గ్రాండ్ వెల్కమ్:**

ఇంగ్లాండ్ కోచ్‌గా ఫ్లెమింగ్: 18 ఏళ్ల పాటు సీఎస్కే కోచింగ్ సెటప్‌లో కీలక పాత్ర పోషించి ఎన్నో ట్రోఫీలను అందించిన స్టీఫెన్ ఫ్లెమింగ్, జులైలో ఇంగ్లాండ్ పురుషుల టెస్టు జట్టు హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సీఎస్కేతో తన బంధాన్ని ముగించడంతో ఫ్రాంచైజీ జహీర్‌ను ఎంచుకుంది. 2017లో ఐపీఎల్ నుంచి ఆటగాడిగా రిటైర్ అయిన తర్వాత జహీర్ ఖాన్ వివిధ ఫ్రాంచైజీలలో కీలక బాధ్యతలు నిర్వర్తించాడు.

**మెంటార్‌గా జహీర్ అనుభవం:**

ముంబై ఇండియన్స్ : ముంబై ఇండియన్స్‌కు డైరెక్టర్ అఫ్ క్రికెట్ ఆపరేషన్స్ గా, ఆ తర్వాత హెడ్ అఫ్ గ్లోబల్ డెవలప్‌మెంట్‌గా సేవలందించాడు.

లక్నో సూపర్ జెయింట్స్ : ఐపీఎల్ 2025 సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ మెంటార్‌గా వ్యవహరించాడు.

ఐపీఎల్ కెరీర్: ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (RCB), ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున 100 మ్యాచ్‌లు ఆడిన జహీర్ 27.27 సగటుతో 102 వికెట్లు పడగొట్టాడు.

అంతర్జాతీయ రికార్డు: టీమిండియా తరఫున మూడు ఫార్మాట్లలో కలిపి ఏకంగా 610 అంతర్జాతీయ వికెట్లు సాధించాడు.

ఐదుసార్లు ఐపీఎల్ ట్రోఫీని గెలుచుకున్న చెన్నై సూపర్ కింగ్స్, 2027 సీజన్ కోసం జహీర్ ఖాన్ మార్గదర్శకత్వంలో ఒక కొత్త శకానికి శ్రీకారం చుట్టింది. జహీర్ సుదీర్ఘ క్రికెటింగ్ విజన్ సీఎస్కే యువ బౌలర్లకు, జట్టు విజయాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అభిమానులు ఆశిస్తున్నారు.

## 700 గ్రాముల బరువుతో ఫైనల్ ఛాన్స్ మిస్: రింగ్‌లోనే ఏడ్చేసిన సుచిక.. కాంస్యంతో సరి!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా గేమ్స్ 2026 లో భారత మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ ఫైటర్ సుచిక తరియాల్ ( చారిత్రాత్మక విజయం సాధించినప్పటికీ, తీవ్ర గుండెకోతకు గురైంది. మహిళల ట్రెడిషనల్ 60 కేజీల సెమీఫైనల్‌లో అద్భుత ప్రదర్శన చేసినా, విచిత్రమైన వెయిట్ రూల్ కారణంగా ఆమె రజతం/పసిడి పోరుకు దూరమై కాంస్య పతకంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈ ఫలితంతో తీవ్ర నిరాశ చెందిన సుచిక మ్యాచ్ ముగియగానే మ్యాట్‌పైనే ఒక్కసారిగా ఏడ్చేసింది.

**1000 డాలర్లు చెల్లించి ఛాలెంజ్ చేసినా:**

సింగపూర్‌కు చెందిన హ్యూ హూన్ టియో తో జరిగిన ఈ సెమీఫైనల్ పోరు అత్యంత ఉత్కంఠభరితంగా కొనసాగింది.

రెగ్యులర్ రౌండ్లు టై: ఇద్దరు ఫైటర్లు చెరో రౌండ్‌లో ఆధిపత్యం చెలాయించడంతో ఓవర్ టైమ్‌కు మ్యాచ్ వెళ్లింది. ఓవర్ టైమ్ తర్వాత కూడా విజేత ఎవరో స్పష్టంగా తేలకపోవడంతో తొలిగా టియోను విజేతగా ప్రకటించారు.

భారత్ రివ్యూ ఛాలెంజ్: రెఫరీ నిర్ణయాన్ని నిరసిస్తూ భారత మేనేజ్‌మెంట్ వ1,000 డాలర్లు (సుమారు ?84,000) ఆర్బిట్రేషన్ ఫీజు చెల్లించి సవాలు చేసింది. ఆరుగురు న్యాయనిర్ణేతలు రీ-రివ్యూ చేసి మ్యాచ్‌ను డ్రా (Draw)గా ప్రకటించారు.

**విజేతను తేల్చిన 700 గ్రాముల బరువు:**

ఇంటర్నేషనల్ మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ ఫెడరేషన్ నిబంధనల ప్రకారం మ్యాచ్ రీ-రివ్యూ తర్వాత కూడా టై అయితే ఉదయం జరిగిన వెయిట్-ఇన్ ఆధారంగా తక్కువ బరువు ఉన్న ఫైటర్‌ను విజేతగా ప్రకటిస్తారు.

తక్కువ బరువుతో టియోకు లబ్ధి: సుచిక ఉదయం 59.2 కేజీల బరువు ఉండగా, సింగపూర్ ప్లేయర్ టియో 58.5 కేజీల బరువు ఉంది.

700 గ్రాముల తేడాతో: కేవలం 700 గ్రాములు తక్కువ బరువు ఉన్నందున టియోను విజేతగా ప్రకటించి ఫైనల్‌కు పంపారు. దీంతో సుచిక కాంస్య పతకానికి పరిమితమైంది.

**ఇది అన్యాయం.. కానీ దేశం కోసం గర్వపడుతున్నా:**

తీర్పు వినగానే తీవ్ర భావోద్వేగానికి గురైన సుచిక, నేను ఈ మ్యాచ్ గెలిచానని భావించాను.. ఫలితాన్ని అంగీకరించలేకపోతున్నాను, ఇది నాకు అన్యాయంగా అనిపించింది. కానీ దేశం కోసం కాంస్యం సాధించినందుకు సంతోషంగా ఉందని ఆవేదన వ్యక్తం చేసింది. హర్యానాలోని రోహ్‌తక్ జిల్లా కిలోయ్ గ్రామానికి చెందిన సుచిక, చిన్నతనంలో రోడ్డుపై వేధింపులను ఎదుర్కొని స్వీయ రక్షణ కోసం కాంబ్యాట్ స్పోర్ట్స్‌లోకి వచ్చి నేడు ఆసియా గేమ్స్ పీఠం ఎక్కింది.

**చరిత్ర సృష్టించిన సుచిక:**

ఓటమి బాధ పక్కనబెడితే, ఆసియా గేమ్స్ చరిత్రలో మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ (వీహీూ) విభాగంలో భారత్‌కు తొలి పతకం అందించిన అథ్లెట్‌గా సుచిక తరియాల్ చరిత్ర పుటలకెక్కింది. సుచిక సాధించిన ఈ కాంస్యంతో ఆసియా గేమ్స్ 2026లో భారత పతకాల సంఖ్య 6కు (4 వెండి, 2 కాంస్యం) చేరింది.

# దసరాకు వస్తే హిట్టే.. మరి ఈసారి?

టాలీవుడ్ లో కొంతమంది హీరోలకు కొన్ని సీజన్లతో స్పెషల్ రిలేషన్ ఉంటుంది. సీనియర్ హీరో విక్టరీ వెంకటేష్ కు సంక్రాంతి అలాంటి సీజన్ అయితే.. దసరా కూడా కలిసొచ్చిన సందర్భాలు ఉన్నాయి. దాదాపు 40 ఏళ్ల సినీ జర్నీలో ఆయన దసరా సమయంలో చాలా తక్కువ సినిమాలతోనే ప్రేక్షకుల ముందుకు వచ్చారు. కానీ వచ్చిన ప్రతిసారీ బాక్సాఫీస్ దగ్గర తన మార్క్ చూపించారు. ఇప్పుడు మరోసారి దసరా సీజన్ లో వెంకీ సినిమా రాబోతుండటంతో ఆ సెంటిమెంట్ పై చర్చ మొదలైంది.వెంకటేష్ ఇప్పటివరకు దసరా సీజన్ ను టార్గెట్ చేస్తూ నాలుగు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చినట్లు తెలుస్తోంది. వాటిలో ఎక్కువ సినిమాలు మంచి విజయాలను అందుకున్నాయి. దీంతో దసరా సీజన్ కూడా వెంకీకి కలిసొచ్చే టైమ్ గా మారింది. 2000లో వచ్చిన జయం మనదేరా అందుకు బెస్ట్ ఎగ్జాంపుల్. అక్టోబర్ లో దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆ సినిమా భారీ విజయాన్ని అందుకుంది.వెంకటేష్ కెరీర్ లో గుర్తుండిపోయే చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. యాక్షన్, ఎమోషన్ తో సాగిన ఆ సినిమా అప్పట్లో ప్రేక్షకులను థియేటర్లకు బాగానే రప్పించింది. ఆ తర్వాత 2007లో తులసితో మరోసారి దసరా బరిలోకి దిగారు వెంకటేష్. బోయపాటి శ్రీను




దర్శకత్వంలో తెరకెక్కిన ఆ సినిమా యాక్షన్ తో పాటు కుటుంబ ప్రేక్షకులకు నచ్చే అంశాలతో వచ్చింది. దసరా సెలవులను క్యాష్ చేసుకున్న ఆ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. 2008లో చింతకాయల రవితో మరోసారి ఇదే సీజన్ లో సందడి చేశారు.ఆ సినిమా గత రెండు చిత్రాల రేంజ్ లో విజయం సాధించకపోయినా.. ప్రేక్షకులను అలరించింది. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులకు కనెక్ట్ అయింది. ఇలా దసరా సీజన్‌లో వెంకటేష్ కు వచ్చిన సినిమాలను చూస్తే.. ఎక్కువ సందర్భాల్లో మంచి రిజల్ట్సే కనిపిస్తాయి. అందుకే ఇప్పుడు రాబోతున్న కొత్త సినిమాపై కూడా ఆ సెంటిమెంట్ చర్చగా మారింది. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో వెంకటేష్ నటిస్తున్న ఆదర్శ కుటుంబం ఈసారి దసరా బరిలోకి దిగేందుకు సిద్ధమవుతోంది. కుటుంబ కథతో పాటు యాక్షన్, కామెడీ ఎలిమెంట్స్ తో తెరకెక్కుతోంది.ముందు అక్టోబర్ 2న విడుదల చేయాలనే ఆలోచన ఉండగా.. దసరా సెలవులను యూజ్ చేసుకునేలా పండుగ వారంలో విడుదల చేయాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే వచ్చిన టీజర్ సినిమాపై హైప్ పెంచింది. త్రివిక్రమ్ డైలాగ్స్, వెంకటేష్ యాక్టింగ్ కలిస్తే ఎలా ఉంటుందనే ఆసక్తి అభిమానుల్లో కనిపిస్తోంది. పైగా దసరా సీజన్ వెంకీకి గతంలో మంచి రిజల్ట్స్ ఇచ్చిన సందర్భాలు ఉండటంతో అంచనాలు మరింత పెరుగుతున్నాయి.అయితే గత రికార్డులు కొత్త సినిమాకు విజయాన్ని ఫిక్స్ చేయవని చెప్పాలి. ఈసారి కథ, కామెడీ, వెంకటేష్ యాక్టింగ్, త్రివిక్రమ్ టేకింగ్ తో పాటు దసరా సెలవులను సినిమా ఎంతవరకు యూజ్ చేసుకుంటుందనేదే మెయిన్. గతంలో దసరా సెంటిమెంట్ ను సక్సెస్ గా మార్చుకున్న వెంకీ.. ఈసారి ఆదర్శ కుటుంబంతో ఆ జోష్ ను కంటిన్యూ చేస్తారా అనేది వేచి చూడాలి.



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965